# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం-17-సెప్టెంబర్-2025 | సంపుటి : 3 | సంచిక : 112 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## సీఎం రేవంత్ దాతృత్వం
## మళ్లీ నడక మొదలెట్టిన రాహుల్

### రెండు కాళ్లు విరిగి అచేతన స్థితిలో ఉన్న వ్యక్తికి ముఖ్యమంత్రి చేయూత

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రోడ్డుపై వెళుతున్నప్పుడు ఒక వాహనం బలంగా ఢీ కొట్టడంలో రెండు కాళ్లు విరిగి అచేతన స్థితిలో ఉన్న వ్యక్తికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయూతనందించారు. నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. మూడు రోజుల కిందట వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ నిమ్స్ ఆసుపత్రిలో వైద్యుడి వద్దకు వెళ్లినప్పుడు అక్కడ రెండు కాళ్లు, దదవ ఎముక విరిగిన ఒక యువకుడు దయనీయ స్థితిలో ఉన్న వ్యక్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మిగతా 2లో..



## 25న బతుకమ్మ కుంటలో
# బతుకమ్మ ఉత్సవాలు

### ఉత్సవాల్లో పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
### ఏర్పాట్లను పరిశీలించిన నేతలు, ఉన్నతాధికారులు
### సర్వాంగ సుందరంగా రూపుదిదుకుంటున్న బతుకమ్మకుంట

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

బతికే ఉన్నాను అని నిరూపించుకున్న బతుకమ్మ కుంట.. పేరును సార్ధకత చేసుకుంటూ ఇప్పుడు బతుకమ్మ ఉత్సవాలకు సిద్ధమౌతోంది. ఈ నెల 25వ తేదీన బతుకమ్మ ఉత్సవాలకు బతుకమ్మకుంట వేదికౌతోంది. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఈ ఉత్సవాలకు హాజరౌతున్నారు. అదే రోజు పండగ వాతావరణంలో బతుకమ్మకుంటను నగర ప్రజలకు ముఖ్యమంత్రి అంకితం చేయనున్నారు. బతుకమ్మ కుంట వద్ద ఈ ఉత్సవ ఏర్పాట్లను ముఖ్యమంత్రి సలహాదారుడు శ్రీ వేంనరేందర్ రెడ్డి గారు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్షించారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు, జీహెచ్ఎంసీ కమిషనర్ శ్రీ ఆర్‌వీ కర్ణన్, జలమండలి ఎండీ కె. అశోక్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు పాల్గొని అక్కడి ఏర్పాట్లను వివరించారు. జాతీయ స్థాయిలో బతుకమ్మ కుంటకు గుర్తింపు వచ్చేలా

మిగతా 2లో..



## ఆక్రమణలను తొలగించండి

### హైడ్రా ప్రజావాణికి 26 ఫిర్యాదులు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

వర్షా లు ముంచెత్తుతున్న వేళ నాలాల ఆక్రమణలపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఒక చెరువు నుంచి మరో చెరువుకు ఉన్న నాలాలు కబ్జాకు గురి అవ్వడంతో పాటు.. వరద కాలువలన్నీ ఎక్కడో ఒక దగ్గర ఆక్రమణలకు గుర్రై వరద నీరు తమ నివాసాలను ముంచెత్తుతోందని పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. క్యాచ్‌మెంట్ ఏరియా ఎంత ఉంది.. నాలా ఎంత వెడల్పులో ఉంటే

మిగతా 2లో..






## ఎంజీబీఎస్‌లో కొత్త పాస్‌పోర్ట్ ఆఫీస్!

- మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- అమీర్‌పేటలోని కేంద్రం ఎంజీబీఎస్‌కు తరలింపు
- టోలీచౌకీలోని కార్యాలయం రాయదుర్గానికి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)


నగరవాసులకు పాస్‌పోర్ట్ సేవలను మరింత సులభతరం చేసేందుకు అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) మెట్రో స్టేషన్‌లో కొత్తగా పాస్‌పోర్ట్ సేవా కేంద్రాన్ని (పీఎస్‌కే) ఏర్పాటు చేశారు. తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఈ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ మార్పుతో నగరంలోని రెండు ప్రధాన పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల చిరునామాలు మారాయి.

మిగతా 2లో..

## కోట్లకు పడగలెత్తిన ఏడీఈ అంబేద్కర్

- ఏసీబీ విస్తృత సోదాలు
- గచ్చిబౌలి, మాదాపూర్ సహా పలు జిల్లాల్లో తనిఖీలు
- కోట్లకు పడగలెత్తిన ఆస్తుల జాబితా
- బినామీ ఇంట్లో కోట్ల రూపాయల నగదు స్వాధీనం
- ఏడీఈ అంబేద్కర్ అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

2లో





## ఎంపీల ఓట్లను రేవంత్ రెడ్డి అమ్ముకున్నారు



- ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీల ఓట్లు బీజేపీకి అమ్మేశారని విమర్శ
- 15 ఓట్ల తేడా.. అందులో 8 తెలంగాణ ఎంపీలవేనని ఆరోపణ
- మోదీ, చంద్రబాబుల మెప్పు కోసమే రేవంత్ ఈ పని చేశారని ధ్వజం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఓట్లను ఆయన బీజేపీకి అమ్ముకున్నారని తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ,

మిగతా 2లో



## అంధ విద్యార్థులకు సంగీత వాయిద్య పరికరాల పంపిణీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సంగీత వాయిద్య పరికరాలను పంపిణీ

కరీంనగర్ (తెలంగాణ ముచ్చట్లు)

కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సంగీత వాయిద్య పరికరాలను పంపిణీ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో పంపిణీ చేయగా ఆ సామాగ్రితో వారు పాటలు పాడి ఆకట్టుకున్నారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంగీతంలో విద్యార్థులకు తర్ఫీదునివ్వగా, సీఎం చేతుల మీదుగా వారికి వాయిద్య సామాగ్రి అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత ఖర్చులతో విద్యార్థులను ప్రత్యేకంగా

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# 25న బతుకమ్మకుంటలో బతుకమ్మ ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడ బతుకమ్మ ఉత్సవాలు జరగాలని సమీక్ష సమావేశంలో శ్రీ వేంనరేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. బతుకమ్మ కుంట చుట్టూ రాబోతున్న ఆకర్షణలను అడిగి తెలుసుకున్నారు.

`హైడ్రా కృషి అభినందనీయం..

ఆక్రమణలకు గురై నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయి పిచ్చి మొక్కలతో అటువైపు వెళ్లాలంటే కాదు.. కనీసం చూడాలంటే భయపడే విధంగా బతుకమ్మ కుంట మారిపోయింది. కబ్జాల చెర నుంచి విముక్తి చేసి.. సర్వాంగ సుందరంగా బతుకమ్మ కుంటగా తీర్చడంలో హైడ్రా కృషి అభినందనీయం%`% అని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు అన్నారు. కబ్జాల చెర నుంచి విముక్తి చేయడానికి రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ ఎంసీ శాఖలతో సమన్వయం చేసుకుంటూ.. కోర్టుకు వాస్తవాలు వివరించి బతుకమ్మకుంటకు జీవం పోసిన ఘనత హైడ్రాదే అని కొనియాడారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు ఇదో యజ్ఞలా చేశారంటూ అభినందించారు. బతుకమ్మ కుంట ఆక్రమణలను తొలగించి..చెరువుగా అభివృద్ధి చేయాలని తాము కోరగానే ముఖ్యమంత్రి గారు ఈ పనిని హైడ్రాకు అప్పగించారు.

**`అందరూ రావాలి.. బతుకమ్మ ఆడాలి..**

బతుకమ్మ కుంట పరిసరాలు ఎంతో ఆహ్లాదంగా ఉన్నాయి. ఇక్కడ ఈ నెల 25న జరగనున్న బతుకమ్మ ఉత్సవాలకు అందరూ రావాలి.. బతుకమ్మ ఆడాలి అని మేయర్ శ్రీమతి గద్వాల్ విజయలక్ష్మి, వి హనుమంతరావు కోరారు. నగరంలో మొదటి విడతా చేపట్టిన 6 చెరువులలో బతుకమ్మకుంట ప్రథమంగా సిద్ధమవ్వడం ఎంతో ఆనందంగా ఉందని శ్రీ వి. హనుమంతరావు గారు అన్నారు. ఉత్సవాలకు కూడా ముఖ్యమంత్రి గారు వస్తానని చెప్పడం..ఎంతో ఆనందంగా ఉందన్నారు. పార్టీలకతీతంగా అందరూ వచ్చి..నగరంలో మరిన్ని చెరువుల అభివృద్ధికి ప్రోత్సహకంగా ఈ ఉత్సవాలు జరగాలని కోరారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో చర్చగా మారిని బతుకమ్మ కుంట అభివృద్ధి ఉత్సవాలతో మరోమారు దేశవ్యాప్తంగా మారుమోగాలని కోరారు.

# సిఎం రేవంత్ దాతృత్వం మళ్లీ నడక మొదలెట్టిన రాహుల్

(మొదటి పేజీ తరువాయి)



కడప జిల్లాకు చెందిన కరీముల్లా చెర్లపల్లిలోని ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. కంపెనీలో పని ముగించుకుని ఇంటికి వెళుతున్న సమయంలో వేగంగా వచ్చిన ఒక వాహనం ఢీ కొట్టడంతో రెండు కాళ్లు విరగడమే కాకుండా పలు గాయాలతో అపస్మార స్థితిలోకి వెళ్లాడు. తర్వాత కరీముల్లాను నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా విరిగిన కాలికి డాక్టర్ లలిత్ మోహన్ ఆపరేషన్ చేశారు. ఈ వివరాలను తెలుసుకున్న వనపర్తి ఎస్పీ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి అందించారు. ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాస్ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి ఆ వ్యక్తి చికిత్సకయ్యే ఖర్చు రూ. 2.50 లక్షల రూపాయల మేరకు ఎల్‌ఓసీ జారీ చేయాలని ఆదేశించారు.

చికిత్సకు అయిన ఖర్చును ఎలా చెల్లించాలో తెలియక తీవ్ర ఆందోళన పడుతున్న సమయంలో మానవతా దృక్పథంతో ముఖ్యమంత్రి వెంటనే స్పందించి సహాయ సహకారాలు అందించారని పేర్కొంటూ, ముఖ్యమంత్రికి కరీముల్లా కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు.

# ఆక్రమణలను తొలగించండి

(మొదటి పేజీ తరువాయి)



సరిపోతుంది అనే విషయాన్ని అధ్యయనం చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు.. సర్వే నంబరు ఒకటి చూపించి మరో చోట ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని, పార్కులు, ప్రజావసరాలకు ఆద్దేశించిన స్థలాలు కబ్జా చేస్తున్నారంటూ పలువురు ఫిర్యాదులందజేశారు. ఇలా హైడ్రా ప్రజావాణికి సోమవారం వచ్చిన 26 ఫిర్యాదుల్లో ఎక్కువ నాలాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపైనే ఉన్నాయి. ఫిర్యాదులను హైడ్రా అదనపు కమిషనర్ శ్రీ ఎన్ అశోక్ కుమార్ గారు పరిశీలించి సబంధిత అధికారులకు వాటి పరిష్కార బాధ్యతలను అప్పగించారు.

కూకట్‌పల్లి మున్సిపాలిటీ, హైదర్‌నగర్ డివిజన్ రామ్‌నరేష్ నగర్‌కాలనీ వరద నీటి కాలువ ద్వరా వర్షపు నీరు సాఫీగా అలీతలాబ్ చెరువులోకి చేరుతుండేది. కాని ఈ నాలా ఎక్కడికక్కడ కబ్జాకు గురి అవ్వడంతో చుట్టుపక్కల ఉన్న నివాసాలను ముంచెత్తుతోందని రామ్‌నరేష్ నగర్ కాలనీ వెల్ఫేర్ ఆసోసియేషన్ హైడ్రాకు ఫిర్యాదు చేసింది. కుండపోత వర్షాల వేళ ఉన్న నాలాలు సరిపోని పరిస్థితి ఉంటే.. అవి కూడా కబ్జా అవ్వడం బాధాకరమని.. ప్రభుత్వం సరైన విధానంతో ఆక్రమణలను తొలగించాలని అసోషియేషన్ ప్రతినిధులు కోరారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం రేణుక యెల్లమ్మకాలనీలో 1600ల గజాల పార్కు స్థలంతో పాటు.. ప్రజావసరాలకు ఉద్దేశించిన 800 గజాల స్థలం కబ్జాకు గురి అవుతోందని.. స్థానికంగా అధికారులకు పిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని.. హైడ్రా అధికారులు జోక్యం చేసుకుని ఆ స్థలాలను కాపాడాలని ఆ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రాకు పిర్యాదు చేశారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి మండలం మూసాపేటలోని అంజయ్యనగర్‌లో ఉన్న పార్కును కాపాడినందుకు హైడ్రాకు అక్కడి నివాసితులు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఈ పార్కు అభివృద్ధికి రూ. 50 లక్షలు జీహెచ్ ఎంసీ కేటాయించడం.. పనులు చేపడితే కొంతమంది అడ్డుకోవడం జరిగింది. దీంతో పనులు ఆపేసి అలాగే వెళ్లిపోయిన జీహెచ్ ఎంసీ అధికారులు. ఇప్పుడు కబ్జాలు తొలగినా పార్కు అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడం బాధాకరమని ప్రజావాణి ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ప్రకటించిన రూ. 50 లక్షల కోసం మళ్లీ ప్రతిపాదనలు పంపామని జీహెచ్ ఎంసీ స్థానిక అధికారులు కాలయాపన చేస్తున్నారని.. దీంతో పార్కు ఉండి ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. ఉప్పల్ మండలం బండ్లగూడ నాగోల్ సర్వే నంబరు 36/6లో ఉన్న ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అవుతోందని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 35/5 ను చూపించి అనుమతులు తెచ్చుకుని 36/6 లోని 3 ఎకరాల ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. స్థానిక అధికారులకు ఈ విషయం తెలిసినా చర్యలు తీసుకోవడంలేదని వాపోయారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించడానికి హైడ్రా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఎంజీబీఎస్‌లో కొత్త పాస్‌పోర్ట్ ఆఫీస్!

(మొదటి పేజీ తరువాయి)



వివరాల్లోకి వెళ్తే, ఇన్ని రోజులు అమీర్‌పేటలోని ఆదిత్య ట్రేడ్ సెంటర్‌లో కొనసాగిన పాస్పోర్ట్ సేవా కేంద్రాన్ని ఇప్పుడు ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌కు పూర్తిగా తరలించారు. అదే విధంగా, టోలీచౌకీ షేక్‌పేట్‌లోని ఆనంద్ సిలికాన్ చిప్ భవనంలో పనిచేస్తున్న మరో కేంద్రాన్ని రాయదుర్గం పాత ముంబయి రోడ్డులోని సిరి బిల్డింగ్‌లోకి మార్చారు. మంగళవారం నుంచి ఈ రెండు కేంద్రాలు తమ కొత్త ప్రదేశాల నుంచి పూర్తిస్థాయిలో సేవలను అందిస్తాయని అధికారులు స్పష్టం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, పాస్పోర్ట్‌ల జారీలో హైదరాబాద్ దేశంలోనే ఐదో స్థానంలో ఉందని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం ఐదు పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు ప్రజలకు సేవలందిస్తున్నాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మిర్జా రియాజ్ ఉల్ హసన్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, పాస్‌పోర్ట్స్ జాయింట్ సెక్రటరీ కే.జే.శ్రీనివాసులు, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన తదితరులు

# కోట్లకు పడగలెత్తిన ఏడీఈ అంబేద్కర్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఆరోపణ నేపథ్యంలో విద్యుత్ శాఖ ఏడీఈ అంబేద్కర్ ఇంట్లో ఏసీబీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారజాము నుంచి సాయంత్రం 5 గంటల వరకు విరామం లేకుండా సోదాలు నిర్వహించారు ఏసీబీ అధికారులు. ఏడీఈ అంబేద్కర్ నివాసంతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ఏసీబీ అధికారులు మొత్తం 15 బృందాలుగా విడిపోయి గచ్చిబౌలి , మాదాపూర్ , హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల్లో పలు చోట్ల సోదాలు చేపట్టి.. ఆస్తుల వివరాలు సేకరించారు. అంబేద్కర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఏడీఈ అంబేద్కర్ కోట్లకు పడగలెత్తినట్లు ఏసీబీ అధికారులు నిర్ధారించారు. శేరిలింగంపల్లిలో ఒక ఫ్లాట్, గచ్చిబౌలిలో జీ ప్లస్ 5 భవనం, పది ఎకరాల్లో అమ్తర్ కెమికల్స్ ఫ్యాక్టరీ, హైదరాబాద్‌లో ఆరు రెసిడెన్షియల్ ప్రైమ్ ఓపెన్ ప్లాట్స్, ఒక వ్యవసాయ క్షేత్రం, రెండు కార్లు, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడిరచారు. ఇక అంబేద్కర్ బినామీ ఇంట్లో రూ. 2.18 కోట్ల నగదు పట్టుబడిరది.



# అంధ విద్యార్థులకు సంగీత వాయిద్య పరికరాల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన బస్సులో హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం విద్యార్థులు పాడిన పాటల సీడీ, దివ్యదృష్టి వీడియో ఆల్బమ్‌లను సీఎం రేవంత్, మంత్రులు పొన్నం, అడ్లూరితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టు అంధులైన ఈ చిన్నారులు తమ దివ్యదృష్టితో సుదీర్ఘమైన సంస్కృత సమాసాలతో ఉన్న స్తోత్రాలను కూడా అలవోకగా పాడుతుండటం అభినందనీయమన్నారు. సొంత భాష కూడా సక్రమంగా ఉచ్చరించలేని ప్రస్తుత పరిస్థితుల్లో స్పష్టంగా రాగయుక్తంగా స్తోత్రాలు ఆలపించటం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. ఎంతో కృషి చేస్తే తప్ప ఇది సాధించలేరని, చిన్నారులు మరింత వృద్ధిలోకి రావాలని ఆశీర్వదించారు. కలెక్టర్ పమేలా సత్పతి విద్యా రంగంలో చిన్నారులను ప్రోత్సహించటం ఆదర్శనీయమన్నారు. వీడియో ఆల్బమ్‌కు నంది శ్రీనివాస్ దర్శకత్వం వహించారు. కేబీ శర్మ సంగీతాన్ని అందించారు. లక్ష్మి గౌతమ్ వీడియో రికార్డు చేశారు. వీరితో పాటు సంగీత ఉపాధ్యాయురాలు సరళను సీఎం అభినందించారు. కఫిసో అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర సమన్వయంతో సాగిన ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్, కలెక్టర్ పమేలా సత్పతి, బాల గాయకులు సింధుశ్రీ, శ్రావణి, తిరుమల, అఖిల, నిత్యశ్రీ, జాహ్నవి, కల్పన, ప్రణయ్, సాయిరామ్, మణిదీప్, అక్షయ్, వరుణ్ తేజ్, మణిరతన్, లోహిత్‌తోపాటు ప్రభుత్వ బధిరుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతి పిల్లలతో కలిసి సచివాలయాన్ని సందర్శించారు.

# ఎంపీల ఓట్లను రేవంత్ రెడ్డి అమ్ముకున్నారు


(మొదటి పేజీ తరువాయి)



ఈ విషయంలో రేవంత్ రెడ్డి అడ్డంగా దొరికిపోయారని వ్యాఖ్యానించారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తమ అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 315 ఓట్లు పడ్డాయని ట్వీట్ చేశారని, కానీ వాస్తవానికి ఆయనకు 300 ఓట్లు మాత్రమే వచ్చాయని కౌశిక్ రెడ్డి గుర్తుచేశారు. గల్లంతైన ఆ 15 ఓట్లలో 8 ఓట్లు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలవేనని ఆయన ఆరోపించారు. ఈ ఎనిమిది మంది ఎంపీలు ఎన్డీఏ అభ్యర్థికి ఓటు వేసి, ఆ తర్వాత కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీలను కలిశారని తెలిపారు. తనకు ముగ్గురు కాంగ్రెస్ ఎంపీలు స్వయంగా ఈ విషయం చెప్పారని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ, చంద్రబాబులతో ఉన్న సంబంధాల కారణంగానే రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రయోజనాలకు ద్రోహం చేస్తున్నారని కౌశిక్ రెడ్డి ధ్వజమెత్తారు. "రాహుల్ గాంధీ దేశంలో ఓట్ల చోరీ గురించి మాట్లాడుతుంటే, ఇక్కడ తెలంగాణ ముఖ్యమంత్రే ఓట్లను దొంగిలిస్తున్నారు. రాహుల్ గాంధీ చెప్పారని అభ్యర్థిని నిలబెట్టి, మోదీ చెప్పారని ఓట్లను అమ్ముకున్నారు" అని ఆయన విమర్శించారు. గురుదక్షిణ పేరుతో రేవంత్ రెడ్డి.. మోదీ, చంద్రబాబులకు మేలు చేస్తున్నారని, సొంత పార్టీ బలపరిచిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి వెన్నుపోటు పొడిచారని అన్నారు.

కాంగ్రెస్ పార్టీని రేవంత్ రెడ్డి నాశనం చేస్తున్నారని, ఆయన కాంగ్రెస్‌కు ముఖ్యమంత్రా లేక బీజేపీకి ముఖ్యమంత్రా అని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రులకు కూడా తెలియకుండా సీబీఐ విచారణకు ఆదేశించడం బీజేపీతో కుమ్మక్కైన దానికి నిదర్శనమని ఆరోపించారు. ఇదేవిధంగా, తెలంగాణకు రావాల్సిన రాజ్యసభ సీటును కూడా పక్క రాష్ట్రానికి చెందిన వ్యక్తికి అమ్ముకున్నారని, గ్రూప్ 1 పోస్టుల భర్తీలోనూ అవకతవకలు జరిగాయని ఆయన విమర్శించారు.



# హాస్టల్ వర్కర్ల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం.!

**సత్తుపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో పనిచేస్తున్న హాస్టల్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐదో రోజు కూడా నిరవధిక సమ్మె కొనసాగింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరిగిన ఈ సమ్మెలో భాగంగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి కు కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కొలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడుతూ, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్‌మెట్రిక్ హాస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో జారీ చేసిన జిఓ 527 అమలు కారణంగా ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు రూ.12 వేల నుండి రూ.9,200కి తగ్గించారని, అలాగే 2021లో తెచ్చిన జిఓ 64 వల్ల డైలీవేజ్ వర్కర్లకు నెలకు రూ.4 వేల నుండి రూ.12 వేల వరకు వేతనాలు తగ్గాయని విమర్శించారు. వెంటనే ఈ జిఓలను రద్దు చేసి, జిఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 10 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, వెంటనే విడుదల చేయాలని, కనీస వేతనం రూ.26 వేల రూపాయలు చొప్పున చెల్లించాలని కోరారు. గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయడంతో పాటు ఉద్యోగులను రెగ్యులర్ చేసి, వారసత్వ నియామకాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ, కార్మికుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కార్మికులు సీతారత్నం, లక్ష్మీదేవి, పార్వతి, సత్యావతి, లక్ష్మి, నాగమణి, ఎల్లమ్మ, పద్మ, జమలమ్మ, సునీత, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛత హి సేవ 2025 విజయవంతం చేయాలి

## కలెక్టర్ స్నేహ శబరిష్

**హన్మకొండ,సెప్టెంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ స్వచ్ఛత హి సేవ-2025 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరగనున్న స్వచ్ఛత సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి గ్రామపంచాయతీ స్థాయిలో శానిటేషన్‌తో పాటు స్వచ్ఛతకు సంబంధించిన విభిన్న కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

జిల్లాలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని స్వచ్ఛతను అలవాటు చేసుకోవడంతో పాటు పరిశుభ్ర వాతావరణాన్ని కొనసాగించేందుకు కృషిచేయాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీను, డిపిఓ రమాకాంత్, స్వచ్ఛ భారత్ జిల్లా ప్రతినిధి సంపత్ కుమార్, ప్రవీణ్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.



# మద్దిగట్ల - మోజర్ల పాఠశాల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం

**పెద్దమందడి,సెప్టెంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** గురుపూజోత్సవం సందర్భంగా పెద్దమందడి మండలం మద్దిగట్ల మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం మంగళవారం జరిగింది. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా స్కూల్ అసిస్టెంట్ (గణితం) శ్రీ డి. రణధీవ్, మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా స్కూల్ అసిస్టెంట్ (భౌతికశాస్త్రం) శ్రీ పి. వెంకటస్వామి ఎంపికైన సందర్భంగా పాఠశాల తరపున వారికి ఘనంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాదరావు మాట్లాడుతూ, "ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం గర్వకారణం. ఈ గుర్తింపు ఉపాధ్యాయులకు మరింత బాధ్యతను కల్పిస్తుంది" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గద్వాల కృష్ణ, భగవంతు, పుల్లయ్య, మధుసూదన్, ఏ. వెంకటస్వామి, కే. శ్రీనివాసులు, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# కేటిఆర్ ఆదేశాల మేరకు మైదం మహేష్ కుటుంబానికి బీఆర్ఎస్ ఆర్థిక సహాయం

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే ఆత్మహత్యకు కారణమని ఆరోపణ
- 50 లక్షల ఎక్స్‌గ్రేషియా డిమాండ్
- కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలలి
- బిఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడే నాగజ్యోతి

**ములుగు,సెప్టెంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** ములుగు జిల్లా మాధవరావుపల్లి గ్రామానికి చెందిన పారిశుద్ధ కార్మికుడు మైదం మహేష్ గత ఐదు నెలలుగా వేతనం అందక మనోవేదనకు గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై బీఆర్ఎస్ పార్టీ స్పందించింది. బాధిత కుటుంబానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రూ.5.50 లక్షల ఆర్థిక సహాయాన్ని ములుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడే నాగజ్యోతి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు మంగళవారం మహేష్ నివాసంలో అందజేశారు.

ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ, మైదం మహేష్ ఆత్మహత్య ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనని తీవ్రంగా విమర్శించారు. ప్రతి నెల వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, మైదం మహేష్ ఆత్మహత్య దానికి ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మున్సిపల్ శాఖలో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.

మహేష్ మరణాన్ని వక్రీకరించి, తప్పుడు వీడియోలు సృష్టించి ప్రచారం చేయడం ప్రభుత్వ దురుద్దేశపూరిత చర్య అని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలతో వైఫల్యాలను కప్పిపుచ్చుకోలేరని హెచ్చరించారు. ములుగు మున్సిపాలిటీ కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం వల్లే కుటుంబం కష్టాల్లో కూరుకుపోయిందని, ఈ పరిస్థితుల్లో ముగ్గురు బాలికలకు దిక్కుగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. మహేష్ కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, పిల్లల చదువుకు పూర్తి బాధ్యతతో పాటు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. అదే సమయంలో, ప్రజల నుంచి సేకరించిన రూ.1,01,116 సహాయం కూడా మహేష్ కుటుంబానికి అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద నాయక్, మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్ రెడ్డి, పల్లెపు శ్రీనివాస్, లింగాల రమణారెడ్డి, లకావత్ నరసింహ నాయక్, కుడుముల లక్ష్మీనారాయణ, జెడ్పిటిసి మాజీ సభ్యులు, సర్పంచులు, గ్రామ అధ్యక్షులు, యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు






# గిరిజన ఆశ్రమ పాఠశాల వర్కర్స్ నిరవధిక సమ్మెకు బీఆర్ఎస్ సంఘీభావం

**వర్కర్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వంపై డిమాండ్: మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు**

**దమ్మపేట, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్స్ నిరవధిక సమ్మెలు కొనసాగుతున్నాయి. పర్మనెంట్ చేయడం, జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించడం, పెండింగ్ జీతాల విడుదలతో పాటు కొత్త మెనూ వల్ల పెరిగిన పనిభారం దృష్ట్యా అదనపు సిబ్బందిని నియమించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. పార్కలగండి, అంకంపాలెం, పెద్ద గొల్లగూడెం, చీపురుగూడెం తదితర ఆశ్రమ పాఠశాలల్లో జరుగుతున్న సమ్మెలకు అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మండల నాయకులతో కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం మండల అధ్యక్షుడు దొడ్డా రమేష్, ఇతర నేతలతో కలిసి వర్కర్స్‌ను పరామర్శించారు.

వర్కర్స్ ఆవేదన: గతంలో కెసిఆర్ పాలనలో జీతాలు సమయానికి వచ్చేవి. ఇప్పుడు ఆరు నెలలు గడిచినా సరిగ్గా రావడం లేదు. జీతాలు పెంచడం మాకెప్పుడూ కనిపించింది కానీ సగం తగ్గించడం మాత్రం ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే చూశాం. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించం అని హెచ్చరించారు. మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన వారు సమ్మె విరమించకపోతే కొత్తవారిని తీసుకొస్తాం అని బెదిరించడం తగదు. రైతుల నుండి విద్యార్థుల దాకా అందరూ రోడ్డెక్కిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో నమ్మకం కోల్పోయింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలి. లేకుంటే రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొడ్డా రమేష్, దారా యుగంధర్, రావుల శ్రీను, జలగం వాసు, సోడెం గంగరాజు, రెడ్డిమల్ల నాగయ్య, మొగిలి కృష్ణ, వెంపటి భరత్, మల్లేష్, కాక శంకర్ ప్రసాద్, నరేంద్ర, రంగ, వెంకటేశ్వరరావు, బీమా రాజు, సూరి చలపతిరావు, మాజీ ఎంపీటీసీ కోర్స శ్రీను, మాజీ సర్పంచ్ కోర్స వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





# మైక్రో బ్రూవరీ బీర్ల తయారీ యూనిట్స్ లైసెన్స్ నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాల

## నానబాల రామకృష్ణ

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 16, తెలంగాణ ముచ్చట్లు;** భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదామని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఈగల్,నార్కోటిక్ ,ఎన్ఫోర్స్మెంట్ వింగ్,ఎలైట్ యాక్షన్ గ్రూప్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అధికారులను సస్పెండ్ చేయాలని ఫార్మా, కెమికల్ పరిశ్రమల పేరిట డ్రగ్స్ దందాకు పాల్పడుతున్న దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం అఖిల భారత యువజన సంఘం ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నానబాల రామకృష్ణ మాట్లాడుతూ. రాష్ట్రంలో చాప కింద నీరులా ప్రవహిస్తున్న డ్రగ్స్ దందా కోట్ల రూపాయల మాఫియాగా ఎదుగుతుంటే డ్రగ్స్ నిర్మూలన కోసమే ఏర్పడిన ఈగల్, నార్కోటిక్ ,ఎన్ఫోర్స్మెంట్ వింగ్,ఎలైట్ యాక్షన్ గ్రూప్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ వంటి సంస్థలు ఏం చేస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలను నిర్మూలించాలని,రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పరిశ్రమలలో ప్రభుత్వం తక్షణమే విస్తృత తనిఖీలు చేపట్టాలని, డ్రగ్స్ తయారు చేస్తున్న, సరఫరా చేస్తున్న దుర్మార్గులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా స్టాప్ డ్రగ్స్ స్టాప్ స్పోర్ట్స్ పేరిట సెప్టెంబర్ మాసం అంతటా రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు, ఇందులో భాగంగానే ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం అధికారికి వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ గవర్నమెంట్ తీసుకొచ్చినటువంటి మైక్రో బ్రువరీ బీర్ షాపుల టెండర్లను వెంటనే రద్దు చేయాలని డ్రగ్స్ అంతం మనందరి బాధ్యత అంటూ ప్లకార్డులు చేతబూని నిరసన తెలియజేస్తూ అనంతరం డ్రగ్స్ ను నిర్మూలించాలని నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా హైదరాబాదులో గల చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో కోట్లు విలువ చేసే డ్రగ్స్, సంబంధిత కెమికల్స్ పట్టుబడటం సిగ్గు చేటు అని ఇది పూర్తిగా మన రాష్ట్ర నిఘా వ్యవస్థ వైఫల్యంగా బావించాలన్నారు. అలాగే బోయినపల్లి లో స్కూల్ యాజమాన్యం ఒక రూమ్ లో డ్రగ్స్ తయారు చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తూ ఉన్నది ఈ యొక్క స్కూల్స్ యాజమాన్యాలు డబ్బుల కోసం కక్కుర్తి పడుతూ ఈ విధంగా యువత భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్న స్కూల్స్ పై చట్ట పరమైన చర్యలు తీసుకున్న ఎటువంటి ఫలితం లేకుండా పోతుందని డ్రగ్స్., షహీద్ భగత్ సింగ్ సెప్టెంబర్ 28న మన దేశంలో జన్మించారని, దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికొయ్యలను సైతం లెక్కచేయకుండా, భవిష్యత్తు తరాల కోసం బ్రిటీష్ ముష్కరులను ఎదిరించి వీరోచిత పోరాటాలు చేసి వీరమరణం పొందరన్నారు. కానీ, భగత్ సింగ్ కలలుగన్న స్వరాజ్య ఆకాంక్షలకు అనుగుణంగా నేటి విద్యార్థులు,యువత పయనుంచడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. దేశానికే ఆదర్శప్రాయుడైన భగత్ సింగ్ స్ఫూర్తితో నేటి యువత చెడు మార్గాలను,చెడు అలవాట్లను విడనాడాలని వారు పిలుపుని చ్చారు. అతి తక్కువ సమయంలో యువకులను లోబరచుకొని, యువతను నిర్వీర్యం చేసే డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాల వలన వ్యక్తులు, కుటుంబాలు తద్వారా సమాజమే సంక్షోభానికి గురవుతుందని, వీటి పట్ల కఠినంగా వ్యవహరించి డ్రగ్స్ నిర్మూలనలో తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాల్సిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వానిదేనని వారు డిమాండ్ చేశారు. చర్లపల్లిలోని వాగ్దేవి ల్యాబ్ యాజమాన్యాన్ని ప్రధాన నిందితుడు శ్రీనివాస్, విజయ్ ఓలేటి, తానాజి పట్వారీ తదితరులను కఠినంగా శిక్షించాలని తెలిపారు. రాష్ట్రంలో అనుమతి లేని కెమికల్ ,ఫార్మా ఇతర కంపెనీలపై దృష్టి పెట్టాలని అనుమతి లేని ఫ్యాక్టరీల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల ఏర్పాటు చేసుకోవడానికి రెంట్ లకు, లీజుకు ఇస్తున్న యజమానులు బాధ్యతను మరువకుండా ఆయా పరిశ్రమల్లో ఏమి తయారు చేస్తున్నారో ముందుగా పరిశీలించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్ ను అరికట్టడంలో చొరవ చూపిస్తున్నా ఆయా శాఖల అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అటువంటి అధికారులను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా చర్లపల్లి ఇండస్ట్రియల్ ప్రాంతంలో మహారాష్ట్ర థానేకు చెందిన క్రైమ్ బ్రాంచ్ పోలీసులు డ్రగ్స్ కోసం రెండ్రోజుల క్రితం సోదాలు నిర్వహించి, మెఫెడ్రోన్ అనే డ్రగ్ను పట్టుకున్నట్లు ప్రకటించారు. సుమారు 6 కేజీల మెఫెడ్రోన్ డ్రగ్, 35 వేల లీటర్ల రసాయనాలు, 950 కిలోల పౌడర్ పట్టుకున్నట్లు తెలిపారన్నారు. వాటి విలువ రూ.12వేల కోట్లు ఉంటుందని సంచలన ప్రకటన చేశారని. దీనిపై రాష్ట్ర నార్కోటిక్స్ బ్యూరో అధికారులు వివరణ ఇచ్చారని. అంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ పట్టుబడలేదని, దొరికిన డ్రగ్స్ విలువ రూ.6 కోట్లు ఉంటుందని, ఈ కేసులో 13 మందిని అరెస్ట్ చేసి ట్రాన్సిట్ వారెంట్తో ముంబైకి తరలించినట్లు పేర్కొన్నారు.అయితే ఎంత మొత్తంలో దొరికిందో నిష్పక్షపాతంగా సమాజానికి తెలపాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏ.ఐ.వై.ఎఫ్ ఉపాధ్యక్షులు కటుకూరి సతీష్ రెడ్డి రూరల్ మండలం నాయకులు మామిండ్ల కిరణ్ ,పి.ఉపేందర్ . సైదులు, అఖిల్ , ఫహీం, శేఖర్, మండే నవీన్ , సాయి, బెజవాడ వెంకన్న, పాల్గొన్నారు.

బుధవారం-17- సెప్టెంబర్ 2025

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వరంగల్ అభివృద్ధి అంశాలపై సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎంపీ కడియం కావ్య

- కాజీపేటలో మల్టీమోడల్ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం,
- కొత్త రైల్వే లైన్లపై సీఎం దృష్టి సారించాలని విజ్ఞప్తి
- చారిత్రాత్మక దేవాలయాల పునరుద్ధరణకు కేంద్ర నిధులు తీసుకురావాలని అభ్యర్థన



**హైదరాబాద్,సెప్టెంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లో మంగళవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై విస్తృతంగా చర్చించారు.కాజీపేట రైల్వే స్టేషన్ ఎదురుగా నూతన మల్టీమోడల్ ఆర్టీసీ బస్టాండ్‌ను త్వరితగతిన నిర్మించాలని సీఎం దృష్టికి ఎంపీ తీసుకువెళ్లారు. ఈ బస్టాండ్ ద్వారా ప్రయాణీకులకు అధిక సౌకర్యాలు కలుగుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. భూపాలపల్లిలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయడంతో పాటు భూపాలపల్లి-హసన్‌పర్తి మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణం జరగాలని, తద్వారా ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం అవుతుందని వివరించారు. అలాగే నష్కల్-హసన్‌పర్తి, చింతల్‌పల్లి-నష్కల్ మధ్య ప్రతిపాదిత రైల్వే బైపాస్ లైన్లు వరంగల్ మాస్టర్ ప్లాన్-2041కు విరుద్ధంగా ఉన్నాయని ఎంపీ ప్రస్తావించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కుడా వంటి సంస్థలతో చర్చించకుండా ఈ ప్రతిపాదనలు రూపొందించారని విమర్శించారు. రైల్వే మౌలిక సదుపాయాలను ఔటర్ రింగ్ రోడ్ కి ఆనుకుని ప్రణాళిక చేయడం ద్వారా రైతుల సమస్యలు తీరడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నగరాభివృద్ధికి తోడ్పడుతుందని సూచించారు. ఈ విషయమై కేంద్ర రైల్వే మంత్రిని కూడా గతంలో కలిసి వినతిపత్రం సమర్పించినట్లు గుర్తుచేశారు. చారిత్రాత్మక దేవాలయాల అభివృద్ధి అంశాన్ని కూడా ఎంపీ సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. వరంగల్‌లోని భద్రకాళి ఆలయం, వేయి స్తంభాల గుడి, చిల్పూర్ బుగులు వెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు భూపాలపల్లి జిల్లాలోని కోటగుల్లు (ఘణపూర్ దేవాలయం), నాపాక, రెడ్డి గుడి దేవాలయాల పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం నిధులు తీసుకురావాలని కోరారు.ఈ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం అందజేస్తామని ఎంపీకి హామీ ఇచ్చారు.

# భద్రాద్రి కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ అవసరం.!



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్ నాయుడును భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై చర్చించేందుకు కలిసారు.
ఇప్పటికే ఒక స్థలంలో ఫీజిబిలిటీ సర్వే పూర్తి అయినప్పటికీ, అనుకూల ఫలితాలు రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం మరో స్థలాన్ని ప్రతిపాదించింది. తుమ్మల నాగేశ్వరరావు స్థానిక వాతావరణం, భౌగోళిక పరిస్థితులు పరిశీలించి, త్వరితగతిన సర్వే పూర్తిచేసి ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి చర్యలు ప్రారంభించాలని కోరారు.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, “దక్షిణ అయోధ్య”గా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయానికి దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు రాకపోకలు సులభం అవుతాయని, సింగరేణి గనులు, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ-బీపీఎల్ వంటి పరిశ్రమలు, అరుదైన ఖనిజ సంపద, ఎకో టూరిజం కేంద్రాలతో జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందిందని తుమ్మల గుర్తుచేశారు.
తుమ్మల నాగేశ్వరరావు “తెలుగు బిడ్డ రాంమోహన్ నాయుడు చొరవతో కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ కల త్వరలోనే సాకారం అవుతుంది. ఈ ప్రాజెక్ట్‌కు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది” అని స్పష్టం చేశారు.





# అంగన్వాడీలపై లాఠీచార్జీ, అరెస్టులను ఖండించిన సీఐటీయూ

**25న చలో సెక్రటేరియట్ విజయవంతం చేయాలని పిలుపు**

**మేడ్చల్-మల్కాజిగిరి, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ టీచర్స్ చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న వారిపై పోలీసులు లాఠీచార్జీ చేయడం, అరెస్టులు జరపడం తీవ్రంగా ఖండనీయమని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ & హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి వద్ద నిరసన చేసిన అంగన్వాడీ టీచర్లు, సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు జయలక్ష్మిపై లాఠీచార్జీ చేయడం అసహ్యకరమని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు ఎ. అశోక్, జె. చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బి. శోభారాణి, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి. సునీత, అల్వాల్ ప్రాజెక్ట్ అధ్యక్షకార్యదర్శులు పి. రామ, పి. శివరాణి, బలమని ఖండించారు. నాయకులు మాట్లాడుతూ:కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానం వల్ల ఐసీడీఎస్‌తో పాటు మొత్తం విద్యా వ్యవస్థకే ముప్పు వాటిల్లుతుందని అన్నారు. పేద ప్రజలు, అంగన్వాడీ వర్కర్లకు ఈ విధానం నష్టదాయకమని ఆందోళన వ్యక్తం చేశారు.అంగన్వాడీ సిబ్బందిపై పడుతున్న పని భారం తగ్గించి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలి అని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చివరిగా ఈ నెల 25న జరగనున్న "చలో సెక్రటేరియట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కమిటీ పిలుపునిచ్చింది.





# ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఉప్పల్ ఎమ్మెల్యే

**కుషాయిగూడ, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 13 మందిని ఘనంగా సన్మానించారు. కాప్రా మండలానికి చెందిన ఈ ఉపాధ్యాయులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా మార్గనిర్దేశం చేయాలని, ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తారని అన్నారు. ఇలాంటి అవార్డులు మరెన్నో అందుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎం ఈ ఓ నర్సింహా మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి వల్లే పాఠశాలల ఖ్యాతి పెరుగుతుందని తెలిపారు. స్కూల్ హెడ్‌మాస్టర్ అరుణ కుమారి ఉపాధ్యాయ దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతాంగానికి యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి : తుమ్మల విజ్ఞప్తి

**సత్తుపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర రైతాంగానికి యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. ఢిల్లీలో మంగళవారం ఆయన కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్‌ను కలిశారు. ఖరీఫ్ సీజన్‌లో ఏర్పడిన రెండు లక్షల టన్నుల యూరియా లోటును ఈ నెలలోనే భర్తీ చేయాలని, రాబోయే రబీ సీజన్‌లో ప్రతి నెలా రెండు లక్షల టన్నుల యూరియా నిరంతరాయంగా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. జియోపొలిటికల్ కారణాల వల్ల కొరత ఏర్పడినప్పటికీ, తెలంగాణ అవసరాలను తీర్చేందుకు వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని అనుప్రియ పటేల్ హామీ ఇచ్చారు.




# తెలంగాణ సాయుధ పోరాట యాదిలో కవితా గానం

**ఏ ఎస్ రావు నగర్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సాయుధ పోరాట యాదిలో భాగంగా కవితా గానం కార్యక్రమం మంగళవారం ఉదయం 11 గంటలకు కమలానగర్‌లోని సీఐటీయూ ఆఫీస్ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్, తెలంగాణ సాహితి సంయుక్తంగా నిర్వహించాయి.
కార్యక్రమానికి తెలంగాణ సాహితీ నగర ఉపాధ్యక్షులు శరత్ సుదర్శి అధ్యక్షత వహించగా, స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గౌడుగు యాదగిరిరావు సమన్వయకర్తగా వ్యవహరించారు.
అధ్యక్షుడు శరత్ సుదర్శి మాట్లాడుతూ, “తెలంగాణ సాయుధ పోరాటం భారతదేశ చరిత్రలో అణగారిన ప్రజలు తిరగబడి చేసిన గొప్ప ప్రజా పోరాటం. ఇది హిందూముస్లిం మధ్య విభేదం కాదు, నిజాం అరాచకానికి వ్యతిరేకంగా అందరూ కలిసి పోరాడిన మహత్తర యుద్ధం” అని పేర్కొన్నారు. నేటి పాలకులు ఆ పోరాటాన్ని వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కవులు, కళాకారులు, మేధావులు నిజమైన పోరాటానికి వెన్నుదన్నుగా నిలవాలని పిలుపునిచ్చారు. తాను రచించిన కవిత ద్వారా తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించారు.ముఖ్య వక్తగా పాల్గొన్న స్ఫూర్తి గ్రూప్ సీనియర్ నాయకుడు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ, “నిజాం అరాచకాలతో పాటు హిందూ జమీందారులు, జాగిర్దారుల పీడనకు వ్యతిరేకంగానే ఈ పోరాటం జరిగింది. బందగి నుండి దొడ్డి కొమరయ్య వరకు వీరుల త్యాగాలు అమూల్యం. నిజాం పటేల్ సైన్యం, కమ్యూనిస్టులను ఊచకోత చేసినా ఈ పోరాటం ప్రజలలో ధైర్యాన్ని నింపింది” అని గుర్తుచేశారు.కార్యక్రమంలో ఎం. భాస్కర్ రావు, కృష్ణమాచార్యులు, శివన్నారాయణ, జయరాజు, గౌడుగు యాదగిరిరావు, దిశ మధు, రుక్కయ్య, బంగారు నర్సింగరావు తదితరులు కవితా గానం చేసి ఆకట్టుకున్నారు. రుక్కయ్య నాటి పల్లెల పరిస్థితిని అద్భుత గానంతో వినిపించారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్ కుమార్, రిషి, దువా కిరటి, శ్రీనివాసరావు, భాస్కర్ రావు, మధు, మల్లేశం, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# "రైతే రాజట"



నీ నోటిన దేశం
అప్పుల మట్టి కొట్టిన
ఆ మట్టి పొరనుండి మెతుకుగా మారి
దేశ తనువుకు ప్రాణ భిక్షమెట్టిన త్యాగం
నీది.
నీ శ్రమ కిలో "రూపాయేనని"
అంగళ్లలో గుండెలపై గుద్ది పంపినా
మళ్ళీ మన్నును
ముద్దాడి దున్ని
ఎద విరుచుకుని
"అన్నదాతగా"
జాతిని నిలిపిన ధైర్యం నీది
నువ్వే రాజనే మాటల కోటపై మరో
యుగమన్నా నిను కూర్చుండబెట్టి
పట్టాభిషేకాన్ని పొడిగించేసే
పన్నాగమేసిన ప్రజాస్వామ్యమిది
ఆత్మ గౌరవమనే
నీ పిడికిడి పొట్టకు
పలు తరాలుగా
పస్తులు పెట్టి
దళారీ నక్కల
"దోపిడీ పంటలు"
ఏపుగా పండే
రైతు సుభిక్ష రాజ్యమిది.

– నేపా.సంతోష్ అచ్యుత్ కుమార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్, కాళోజి ప్రతిభ పురస్కార గ్రహీత,విజయవాడ,
8639442397



## నాయి బ్రాహ్మణుల ఆపద బాంధవ్యుడు యలమందల జగదీష్..

### మాదారపు నరసమ్మ కుటుంబానికి నిత్యవసర సరుకులు, ఆర్థిక సాయం అందజేత..

**ఖమ్మం బ్యూరో,సెప్టెంబర్ 16 , తెలంగాణ ముచ్చట్లు:**ఆపద సమయంలో ఆదుకున్న వారే నిజమైన ఆత్మీయులు అన్నారు మహానుభావులు. ఖమ్మం జిల్లా, తల్లాడ గ్రామానికి చెందిన మాదారపు సైదులు ప్రమాదంలో మరణించడం, ఆయనకు భార్య నలుగురు కుమార్తెలు ఉండడంతో విషయం తెలుసుకున్న నాయి బ్రాహ్మణుల సంక్షేమ సంఘం ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు తన వంతు సహాయంగా మంగళవారం 3 వేల రూపాయల నిత్యవసర సరుకులు, 2 వేల రూపాయల ఆర్థికసాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా యలమందల జగదీష్ మాట్లాడుతూ.. ప్రతి మనిషి సహాయం చేసే గుణం కలిగి ఉండాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం దైవ లక్షణం అన్నారు. ఆపదలో ఉన్న ఆ కుటుంబానికి తన వంతుగా సహాయం అందించడం జరిగిందన్నారు. ఇలానే మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరు స్పందిస్తే ఆ కుటుంబానికి కొంతైనా ఆర్థిక భారం తీరి, భర్త లేని లోటు కూడా ఉండదనే విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణుల జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 16, తెలంగాణ ముచ్చట్లు;** ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చింతకాని మండల పరిధిలోని నేరడ గ్రామానికి చెందిన షేక్ రంజాన్ బి 60 వేల రూపాయలు చెక్కు అందించడం జరిగింది. అంబటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ అఫ్జల్ ఎస్సీ మండల సెల్ అధ్యక్షులు వనం చిన్నప్ప గ్రామ కాంగ్రెస్ నాయకులు షేక్ సుభాని మైనార్టీసెల అధ్యక్షులు షేక్ ఇసుబ్ మీయ పులిపాటి నాగరాజు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ యాకుబ్ పాషా తవటపు సాయి బూత్ కన్వీనర్ షేక్ షర్ఫుద్దీన్ షేక్ బాబు షేక్ నాగుల షేక్ బాషా పులిపాటి రవి తదితరులు పాల్గొన్నారు



## ఇంటూరి శేఖర్‌కు మాజీ ఎంపీ నామ పరామర్శ

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 16, తెలంగాణ ముచ్చట్లు;** బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ మాతృమూర్తి భద్రమ్మ సోమవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. ఈ విషయం తెలిసిన బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శేఖర్‌ను ఫోన్‌లో పరామర్శించినారు. వారి మాతృమూర్తి మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసి ఓదార్చినారు. నామ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం కూసుమంచి మండలం, గోపాలరావుపేట గ్రామంలోని శేఖర్ స్వగృహానికి బిఆర్ఎస్ నాయకులు కనకమేడల సత్యనారాయణ,గొడ్డేటి మాధవరావు, నామ వ్యక్తిగత కార్యదర్శి నాగరాజు వెళ్లి భద్రమ్మ గారి పార్థివదేహానికి పూలు వేసి నివాళులర్పించారు.

## దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే మర్రి వినతి

**మల్కాజ్గిరి, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి నియోజకవర్గానికి చెందిన దేవాలయాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలన్న డిమాండ్‌తో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం రాష్ట్రసచివాలయంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్ నాలుగో అంతస్తులో జరిగిన ఈ



భేటీలో ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఇందులో మల్కాజ్గిరి పరిధిలోని పలు పురాతన ఆలయాలు పునరుద్ధరణ, మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రత్యేక నిధులు అవసరమని వివరించారు.మంత్రి కొండా సురేఖ ఈ వినతిపత్రాన్ని స్వీకరించి, ఆలయాల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించడానికి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





# వర్షం పడితే మురుగునీరు ఇళ్లలోకి

### అధికారుల కాళ్ల మీద పడినా పరిష్కారం లేని చిన్మయ మార్గ్ లేన్ కాలనీవాసుల ఆవేదన

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**మల్కాజిగిరి నియోజకవర్గం గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని మీర్జాలగూడ చిన్మయ మార్గ్ లేన్ కాలనీవాసులు అనేక సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం పడితే మురుగునీరు, వర్షపు నీరు ఇళ్లలోకి చేరి ప్రజల జీవన విధానం అస్తవ్యస్తమవుతోందని వాసులు అన్నారు. ఇంటి నుండి బయటకు రావడం కష్టంగా మారిందని, వృద్ధులు, చిన్నపిల్లలు రోగాల బారిన పడుతున్నారని వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మల్కాజిగిరి జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు. కాలనీలో రహదారి విస్తరణ చేసి పెద్ద బాక్స్ డ్రైనేజ్ నిర్మించకపోతే తమ సమస్యకు శాశ్వత పరిష్కారం ఉండదని స్పష్టం చేశారు.దీనిపై స్పందించిన ఉప కమిషనర్ జకియా సుల్తానా మంగళవారం టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి చిన్మయ మార్గ్ లేన్ కాలనీని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అయితే వాసుల వాదన ప్రకారం అధికారులు కేవలం పరిశీలనకే పరిమితమై ఎటువంటి భరోసా ఇవ్వకుండానే వెళ్లిపోవడంతో తీవ్ర నిరాశ వ్యక్తమైంది. కాలనీవాసులు అధికారుల ముందు కాళ్లపై పడి మొరపెట్టుకున్నా సరైన స్పందన రాకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు శోభ, కొమరమ్మ మాట్లాడుతూ "మా సమస్యలను అధికారులు పరిష్కరించకపోతే మేము నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాలయం ముందు నిరసన చేపడతాం. మల్కాజిగిరి అధికారుల నిర్లక్ష్యం గురించి సీఎంని నేరుగా ఫిర్యాదు చేస్తాం అని హెచ్చరించారు.కాలనీవాసుల ప్రధాన డిమాండ్లు: కాలనీలో రహదారి విస్తరణపెద్ద బాక్స్ డ్రైనేజ్ నిర్మాణం వర్షపు నీరు, మురుగునీరు సమస్యకు శాశ్వత పరిష్కారంఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: సత్యనారాయణ, కొమరమ్మ, జంగాల శ్రీరామ్ యాదవ్, శోభ, అఖిల్, సూరి, కవిత, భాస్కర్ తదితరులు.







# వనపర్తిలో అంగన్వాడి సిబ్బందికి మూడు రోజుల శిక్షణ

**వనపర్తి,సెప్టెంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా ప్రాజెక్టు పరిధిలోని ఐదు మండలాల అంగన్వాడి సిబ్బందికి మూడు రోజులపాటు పోషణ్ భీ, పడాయి భీ శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ శిక్షణ 16 నుండి 18వ తేదీ వరకు కొనసాగనుంది. శూన్యం నుంచి ఆరు సంవత్సరాల పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం ఈ శిక్షణ చేపట్టారు. ఇందులో భాగంగా 0-3 ఏళ్ల పిల్లలకు నవచేతన, 3-6 ఏళ్ల పిల్లలకు ఆధారశీల విధానాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమాన్ని ప్రాజెక్టు అధికారి హజీరా పర్యవేక్షిస్తున్నారు. పర్యవేక్షకులు జ్యోతి, సుధ, నాగరాణి, ఇదమ్మ, సుజాత, వసంత, శ్రీలక్ష్మి శిక్షణ అందిస్తున్నారు.

# విదేశీ నాసిరకం పామాయిల్ విత్తనాలపై సమగ్ర దర్యాప్తు జరపాలి

### పామాయిల్ రైతుల సమస్యల పరిష్కారానికి కిసాన్ సభ జాతీయ నేతలకు వినతి

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** విదేశాల నుంచి దిగుమతి చేసిన నాసిరకం పామాయిల్ విత్తనాల వల్ల తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు న్యాయం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ పామాయిల్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలోని సూరజిత్ భవన్‌లో అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు అశోక్ దవాలె, కార్యదర్శి విజు కృష్ణన్‌లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ పామాయిల్ రైతు సంఘం అధ్యక్షులు తుంబూరు మహే




శ్వర రెడ్డి, కార్యదర్శి కొక్కరపాటి పుల్లయ్య మాట్లాడుతూ — 2019, 2020, 2021 వరుస సీజన్లలో విదేశాల నుంచి దిగుమతి చేసిన నాసిరకం విత్తనాలను నర్సరీల్లో పెంచి రైతులకు సరఫరా చేయడంతో ఐదారు సంవత్సరాలుగా పామాయిల్ తోటలు పండకపోవడం వల్ల రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని వివరించారు. ప్రతి ఎకరాకు సగటున ఐదు లక్షల రూపాయలు ఖర్చు పెట్టినా దిగుబడి రాకపోవడంతో, సంవత్సరం వారీగా రెండు లక్షల రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విదేశీ విత్తనాలు దిగుమతి చేసిన సంస్థలపై సమగ్ర విచారణ జరిపి రైతులకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, పామాయిల్ రైతుల సమస్యల పరిష్కారంలో అఖిల భారత కిసాన్ సభ తమతో నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్, ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, మూడు శోభన్, పి.జంగారెడ్డి, శ్రీనివాసులు, సోమయ్య, వెంకట్, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై జిహెచ్ఎంసి కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**మల్కాజిగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మంగళవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఐఏఎస్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. చెరువుల పరిరక్షణకు ప్రాధాన్యం ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మల్కాజిగిరిలోని చెరువుల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. చెరువులను ఆక్రమణల నుండి రక్షించడం, శుద్ధి చేయడం, బ్యూటిఫికేషన్ చేపట్టడం, చెరువు పరిసరాలను పార్కులుగా అభివృద్ధి చేయడం వంటి చర్యలు అత్యవసరమని పేర్కొన్నారు. చెరువులు కేవలం నీటి వనరులుగానే కాకుండా స్థానిక పర్యావరణ సమతౌల్యానికి, భూగర్భ జలాల నిల్వకు



కూడా ముఖ్యమని గుర్తు చేశారు.
వసతుల మెరుగుదలపై చర్చ
మల్కాజిగిరి నియోజకవర్గంలోని రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, కాలువల విస్తరణ, వీధి దీపాలు, మురుగు నీటి సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ఎమ్మెల్యే విస్తృతంగా చర్చించారు. ప్రాంతీయ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నివేదికలను కమిషనర్‌కు అందజేశారు.కమిషనర్ హామీ ఈ ప్రతిపాదనలపై జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సానుకూలంగా స్పందించారు. అవసరమైన శాఖాధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన చర్యలు తీసుకోవాలని భరోసా ఇచ్చారు. అభివృద్ధి పనులు దశలవారీగా అమలు చేసి, ప్రజలు అనుభవిస్తున్న ఇబ్బందులను తొలగించేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.స్థానిక నాయకుల భాగస్వామ్యం ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, తోట నరేందర్ రెడ్డి, డోలి రమేష్, లక్ష్మణ్ యాదవ్, హేమంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి దిశగా ఎమ్మెల్యే చేసిన ఈ ప్రయత్నానికి వారు మద్దతు తెలిపారు.ప్రజలకు నూతన ఆశలు ఈ సమావేశంతో మల్కాజిగిరి ప్రజల్లో కొత్త ఆశలు కలిగాయి. చాలా కాలంగా వాయిదా పడుతున్న చెరువుల పరిరక్షణ, కాలువల సమస్యలు, మురుగు నీటి నిల్వలు, పార్కుల అభివృద్ధి వంటి అంశాలు త్వరలో పరిష్కారమవుతాయన్న నమ్మకం కలుగుతోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# ఆర్టీసీ కార్మికుల ఐక్యతే సమస్యల పరిష్కారానికి మార్గం

- ఖమ్మంలో ఘనంగా ఎస్.డబ్ల్యూ.ఎఫ్ 47వ ఆవిర్భావ దినోత్సవం
- పోరాడి విజయం సాధించిన భద్రాచలం కార్మిక వర్గానికి జేజేలు
- స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గడ్డం లింగమూర్తి

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 16 , తెలంగాణ ముచ్చట్లు;**ఆర్టీసీ కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్మికవర్గ ఐక్యతా పోరాటలే ఏకైక మార్గమని భద్రాచలం డిపో కార్మికులు సాధించిన విజయం కార్మికవర్గ ఐక్యతకు విజయం సాధించడానికి నిదర్శనమని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మంలోని సిహెచ్.వి.రామయ్య స్మారక భవనం వద్ద గుర్రం రామారావు అధ్యక్షతన ఏర్పాటైన ఎస్.డబ్ల్యూ.ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు శ్వేతారుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గడ్డం లింగమూర్తి మాట్లాడుతూ.. ఆర్టీసీలో ఎస్.డబ్ల్యూ.ఎఫ్ ఆవిర్భావం తర్వాతనే ఐక్య పోరాటాల ఒరవడి ప్రారంభమైందని, ఐక్య పోరాటాల ద్వారానే అనేక విజయాలు ఆర్టీసీ కార్మికులు సాధించుకున్నారని పేర్కొన్నారు. భద్రాచలండిపోలో కార్మికులు అపూర్వ ఐక్యత కనబరిచి పోరాడి తమ సమస్యలు పరిష్కరించుకున్నారని, వారి పోరాటానికి జేజేలు పలుకుతున్నామన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న భద్రాచలం కార్మికులకు అండగా రీజియన్ స్థాయి జేఏసీ ఏర్పాటుకోసం ఎస్.డబ్ల్యూ.ఎఫ్ కృషి చేసిందన్నారు. భద్రాచలం సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎర్రబ్యాడ్జీలు ధరించి ఆందోళన, రీజనల్ మేనేజర్ కి మెమోరాండం ఇవ్వడం లాంటి కార్యక్రమాలు, రీజియన్ జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి)గా నిర్వహించారని తెలిపారు. రాష్ట్రస్థాయిలోనూ భద్రాచలం సమస్య వెళుతున్న క్రమంలో యాజమాన్యం స్పందించి సమస్యలు పురస్కరించటం అభినందనీయం అన్నారు. గతానికి భిన్నంగా భద్రాచలంలో రెండు రోజుల మస్టర్ డ్యూటీలను మూడు రోజులకు మార్చడం, వారు పోరాడిన ఎనిమిది రోజుల కాలాన్ని సెలవుగా పరిగణించడం కార్మిక వర్గం సాధించిన గొప్ప విజయం అన్నారు. ఈ పోరాటంలో భాగస్వాములైన డ్రైవర్ సోదరులందరికీ వారి పోరాటానికి మద్దతు ఇచ్చిన కార్మిక ప్రజా సంఘాలకు, అదేవిధంగా సానుకూలంగా స్పందించి పరిష్కరించిన రీజనల్ యాజమాన్యానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రస్థాయి లోనూ ఇదే రకమైన సమస్యలు ఉన్నాయని అందువల్ల రాష్ట్ర స్థాయిలో కార్మిక సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీనియర్ సభ్యులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు, తోకలు బాబు, దండా కృష్ణమూర్తి, రంగా రామారావు, పొగాకు వెంకటకృష్ణ, కందికొండ నాగేశ్వరరావు తదితరులు కేక్ కట్ చేసి, పంచి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఖమ్మం డిపో కార్యదర్శి గుగ్గిళ్ళ రోశయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు ఖమ్మం రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు గుండు మాధవరావు, పిట్టల సుధాకర్ రీజియన్ ఉపాధ్యక్షులు హెచ్ బసవయ్య, ప్రచార కార్యదర్శి తోకల బాబు, రీజియన్ కోశాధికారి పగిళ్లపల్లి నరసింహారావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెరుకూరి రామకృష్ణ (ఆర్కే నాయుడు) జి. బాబు, ఆర్.ఈ.వి కుమార్, కోటి, వేణు, అయోధ్య, ఎ.శ్రీనివాస్, మారుతి, సురేష్, కెవెన్ చారి, సరిత, రామలక్ష్మి, షేక్ బాషా, యండి పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలపై ఎస్ఈ అశోక్ రెడ్డితో కార్పొరేటర్ శాంతి సాయిజెన్ సమావేశం

- జాన్సన్ గ్రామర్ స్కూల్ వద్ద వర్షపు నీటి సమస్య పరిష్కారానికి 54 లక్షల ప్రతిపాదనలు
- రెడ్డి స్మశాన వాటిక, వార్డు కార్యాలయ లిఫ్ట్ పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి

**నాచారం, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** నాచారం డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిపై ఎల్.బి. నగర్ ఎస్ఈ అశోక్ రెడ్డితో నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ చర్చలు జరిపారు.ఈ సందర్భంగా జాన్సన్ గ్రామర్ స్కూల్ వద్ద వర్షపు నీటి నిల్వ సమస్య తీవ్రంగా ఉన్నదని, దాని పరిష్కారానికి 54 లక్షల రూపాయల ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా రెడ్డి స్మశాన వాటికలో మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి మరియు వార్డు కార్యాలయంలో లిఫ్ట్ ఏర్పాటు కోసం అవసరమైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రజా సమస్యల పరిష్కారమే బస్తీ బాట ప్రథమ ధ్యేయం నెమలి అనిల్ కుమార్

**మల్లాపూర్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ డివిజన్ స్వామి వివేకానంద నగర్ కాలనీలో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పర్యటించారు. కాలనీ అధ్యక్షులు నెమలి రవి కుమార్ తో కలిసి కాలనీలో పలు సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.మన కాలనీ - మన పరిశుభ్రత అనే నినాదంతో కాలనీ వాసులకు అవగాహన కల్పించి, చెత్తను బహిరంగంగా వేయకుండా నివారించేందుకు కెమెరా, స్పీకర్లు కాలనీ అసోసియేషన్‌కు అందించారు. పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని నెమలి అనిల్ కుమార్ తెలిపారు. అదేవిధంగా, రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద సంవత్సరాలుగా సమస్యగా ఉన్న ట్రాన్స్ఫార్మర్ ఫ్యూజ్ బాక్స్‌ను తొలగించి, విద్యుత్ శాఖ సహకారంతో కొత్త ఫ్యూజ్ బాక్స్‌ను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ విద్యుత్ శాఖ ఏఈ నాగరాజ్, జిహెచ్ఎంసి సానిటరీ ఇన్స్పెక్టర్ సుదర్శన్, కాలనీ వాసులు పైళ్ల శ్రీనివాస్, అనిల్ జైన్, యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి, నాగరాజ్, రాజేష్, రాము, విద్యుత్ మరియు జిహెచ్ఎంసి సిబ్బంది పాల్గొన్నారు.



# లక్ష్మీనగర్ స్మశాన వాటిక అభివృద్ధి పనులకు మార్గం సుగమం

**కాప్రా, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని దాదాపు 25 కాలనీల ప్రజలు వినియోగిస్తున్న లక్ష్మీనగర్ స్మశాన వాటిక చాలా కాలంగా నిర్లక్ష్యానికి గురవుతూ వస్తోంది. స్మశాన వాటికలో తగిన ప్రాథమిక సదుపాయాలు లేకపోవడంతో అంత్యక్రియలకు వచ్చే కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో నీరు నిల్వలు, వాహనాల పార్కింగ్ సమస్యలు, తాగునీటి సౌకర్యం లేకపోవడం, రాత్రి వేళల్లో విద్యుత్ దీపాల సమస్య వంటి ఇబ్బందులను స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పెద్దగా మార్పు కనిపించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై బీజేపీ మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ అధ్యక్షులు రామ్ ప్రదీప్ మునుగంటి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు కలిసి మాల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను నేడు మర్యాదపూర్వకంగా కలిశారు. లక్ష్మీనగర్ స్మశాన వాటిక అభివృద్ధి, ఆధునీకరణ కోసం ఎంపీ ఎల్ఏడీ నిధులు కేటాయించాలని కోరారు. ప్రజల సమస్యను అర్థం చేసుకున్న ఎంపీ వెంటనే స్పందించి, జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఐఏఎస్‌కు లేఖ రాసి స్మశాన వాటిక అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు.బీజేపీ నాయకులు మాట్లాడుతూ, “ప్రజా సమస్యల పట్ల ఎల్లప్పుడూ స్పందిస్తూ, సాధ్యమైన పరిష్కారం చూపడానికి ప్రయత్నించే ఎంపీ రాజేందర్‌కు డివిజన్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాం” అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బ్రహ్మాచారి, డివిజన్ ప్రధాన కార్యదర్శులు గోపు రాజేశ్వర్, జంగ బాలరాజ్, ఉపాధ్యక్షులు సాయి పవన్, హర్ష గౌడ్, మహిళా మోర్చా అధ్యక్షులు శశికళ, యువ మోర్చా అధ్యక్షులు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా నిలిచిన పీఎస్ఆర్ ట్రస్ట్

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 16, తెలంగాణ ముచ్చట్లు:** ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావాలని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనలతో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ మరోసారి సేవా కార్యక్రమం చేపట్టింది.

ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు మరణించిన 13 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10,000 చొప్పున ఆర్థిక సాయం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు దుఃఖంలో మునిగిన కుటుంబాలను పరామర్శిస్తూ.... వారికి అండగా నిలిచారు. ఆపద సమయంలో తోడుగా నిలిచిన ఈ సహాయం పట్ల బాధిత కుటుంబాలు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయుడుపేట, టీచర్స్ కాలనీ, పెద్దతండా కాలనీ, కోట నారాయణపురం, వెంకటగిరి, గుదిమళ్ల, తెల్దారుపల్లి, ఏదులాపురం, ముత్తగూడెం, రెడ్డిపల్లి, చిన్నతండా తదితర గ్రామాలకు ఈ సాయం అందింది.పొంగులేటి శ్రీనివాస రెడ్డి మార్గదర్శకత్వంలో చేపడుతున్న ఈ సహాయక కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని నిర్వాహకులు స్పష్టం చేశారు.






# రియల్టర్ శ్రీకాంత్ రెడ్డి హత్య కేసు ఛేదన

**కుషాయిగూడ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు**

**కాప్రా, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** మీర్పేట్ హెచ్.బి కాలనీ డివిజన్ మౌలాలీలో రియల్టర్ & బిల్డర్ మొగుళ్ల శ్రీకాంత్ రెడ్డి (42)ను పగటిపూట దారుణంగా హత్య చేసిన కేసును కుషాయిగూడ పోలీసులు ఛేదించారు. ఈ ఘటన సెప్టెంబర్ 12న మంగాపురం కాలనీలో చోటుచేసుకుని తీవ్ర కలకలం రేపింది. పోలీసుల సమాచారం ప్రకారం, వ్యాపార ఒప్పందంలో ఒక కోటి రూపాయల చెల్లింపు వివాదం కారణంగా మృతుడిపై పగ పెంచుకున్న మాజీ సూపర్వైజర్ బేఖోన్ ధనరాజ్ అలియాస్ ధను యాదవ్ (32), అతడి సహచరులు డిసౌజా డేనియల్ (28), బెజిరమేని సంతోష్ కుమార్ (38) కలిసి హత్యకు కుట్రపన్నారు.

సెప్టెంబర్ 12 సాయంత్రం 5:30 గంటలకు శ్రీకాంత్ రెడ్డి ఆఫీస్‌కు తాళం వేస్తుండగా నిందితులు వెనుకనుంచి కత్తులతో దాడి చేసి హతమార్చారు. అనంతరం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసిన పోలీసులు, నిందితులను జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌లో అరెస్టు చేశారు.వారి వద్ద నుంచి హత్యాయుధం, రక్తంతో తడిసిన బట్టలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను చెర్లపల్లి జైలుకు తరలించారు. ఈ ఆపరేషన్‌ను రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు పర్యవేక్షణలో, మల్కాజిగిరి జోన్ డీసీపీ పి.వి. పద్మజ, అదనపు డీసీపీ వెంకటరమణ, కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి బృందం విజయవంతంగా నిర్వహించారు.

# మల్లారంలో ఊటవాగుకి రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి..



**కలెక్టర్ అనుదీప్ కి వినతి అందించిన రైతు పూనాటి కృష్ణయ్య..**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 16, తెలంగాణ ముచ్చట్లు;** తల్లాడ మండల పరిధిలోని మల్లవరం గ్రామంలో ఊటవాగుకు రోడ్డు, బ్రిడ్జి నిర్మాణాలు ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన రైతు పూనాటి కృష్ణయ్య జిల్లా కలెక్టర్ అనుదీప్ కు ప్రజావాణిలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ పొలాలకు వెళ్లాలంటే రైతులు అనేక అవస్థలు పడుతున్నారని, పంటలు పండించుకునేందుకు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఒక కోటి 14 లక్షల ఎస్టిమేషన్ పత్రాలను ఆయనకు అందించారు. దీనికి స్పందించిన కలెక్టర్ ఈ విషయాన్ని జిల్లా అధికారుల ద్వారా సర్వే చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు రైతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గ్రామానికి చెందిన కోటేశ్వరరావు, శివ ఉన్నారు.




## స్వల్ప నష్టాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్లలో ఎనిమిది రోజులుగా కొనసాగుతున్న లాభాలకు సోమవారం బ్రేక్ పడిరది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశం జరగనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండటంతో ప్రధాన సూచీలు స్వల్ప నష్టాలతో ఫ్లాట్‌గా ముగిశాయి. అయితే, జీఎస్టీ సంస్కరణల కారణంగా దేశీయ వినియోగం బలంగా ఉండటంతో మార్కెట్లు పెద్దగా పడిపోకుండా నిలదొక్కుకున్నాయి. సోమవారం ట్రేడిరగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 118.96 పాయింట్లు నష్టపోయి 81,785.74 వద్ద స్థిరపడిరది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 44.80 పాయింట్ల నష్టంతో 25,069.20 వద్ద ముగిసింది. యూఎస్ ఫెడ్ సమావేశంపై అనిశ్చితి, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ ఈ నష్టాలకు ప్రధాన కారణాలుగా మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. అయితే, దేశీయంగా బలమైన వినియోగం, వాణిజ్య ఒప్పందాలపై ఆశలు, రాబోయే ఆర్థిక సంవత్సరంలో కంపెనీల ఆదాయాలు మెరుగుపడతాయన్న అంచనాలు మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయి. సెన్సెక్స్ స్టాక్స్‌లో ఏషియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, ఇన్ఫోసిస్, సన్ ఫార్మా వంటి షేర్లు నష్టాల్లో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్ టీ వంటివి స్వల్ప లాభాలను నమోదు చేశాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఆటో సూచీలు నష్టపోయాయి. మరోవైపు, నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ఫిన్ సర్వీసెస్ స్వల్ప లాభాలతో ముగిశాయి. ప్రధాన సూచీలు ఫ్లాట్‌గా ఉన్నప్పటికీ, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు లాభపడ్డాయి. మార్కెట్ పడిపోయినప్పుడు కొనుగోలు చేయడం మంచి వ్యూహమని నిపుణులు సూచిస్తున్నారు.



## భారీగా పెరిగిన బంగారం ధరలు..!

ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మహిళలు బంగారు అభరణాలు ధరిస్తారు. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లోని మహిళలందరూ బంగారానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. అనేక రకాల డిజైన్లతో లక్షల్లో విలువ చేసే కమ్మలు, నెక్లెస్లు, బ్యాంగిల్స్ వంటివి కొనుగోలు చేస్తుంటారు. ఆడవాళ్లకు ప్రతి రోజూ షాపింగ్ చేసిన బోర్ కొట్టదనడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పవచ్చు. కాగా గోల్డ్ రేట్లు ఎప్పుడెప్పుడు తగ్గుతాయా? అంటూ మహిళలు వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. కాస్త పసిడి ధరలు తగ్గుముఖం పట్టగానే బంగారం షాపుల్లో ఎగబడుతారు. అయితే ఇటీవల బంగారం ధరల్లో హెచ్చు తగ్గులు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ రేట్లతో మహిళల్లో ఓసారి ఉత్సాహం నెలకొనగా... మరోసారి నిరాశకు గురవుతుంటారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో బంగారం రేట్లు భారీగా పెరుగుతున్నాయి. కొంచెం తగ్గగానే డబుల్, త్రిబుల్ ధర పెరుగుతుంది. ఇవాళ గోల్డ్ ప్రియులకు భారీ షాక్ తగిలింది. నిన్న 22 క్యారెట్లు.. 10 గ్రాముల బంగారం రూ. 1,01, 800 ఉండగా.. నేడు రూ. 800 పెరిగి రూ. 1,02,600 కు చేరింది. ఇక నిన్న 24 క్యారెట్లు 10 గ్రాముల బంగారం ధర రూ. 1,11, 060 గా ఉంది. నేడు రూ. 870 పెరిగి రూ. 1,11, 930 గా ఉంది. కాగా ఈ నేపథ్యంలో నిన్నటి ధరతో పోలిస్తే ఇవాళ పసిడి ధరల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.




## 26 శాతం క్షీణించిన వాణిజ్య లోటు

దేశ ఎగుమతులు వరుసగా రెండో నెలా పుంజుకున్నాయి. సోమవారం ప్రభుత్వ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఆగష్టులో దేశ ఎగుమతులు 6.7 శాతం పెరిగి 35.1 బిలియన్ డాలర్ల(రూ. 3.09 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. అంతకుముందు జూలై నెలలో ఇవి 37.24 బిలియన్ డాలర్లు(రూ. 3.28 లక్షల కోట్లు) గా ఉన్నాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. దిగుమతులు 10.1 శాతం తగ్గి 61.6 బిలియన్ డాలర్ల(రూ. 5.43 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. దీంతో ఆగస్టులో భారత వాణిజ్య లోటు 26.5 బిలియన్ డాలర్లు(రూ. 2.34 లక్షల కోట్లు)గా ఉందని, అంతకుముందు నెలలో ఇది 27.35 బిలియన్ డాలర్లు(రూ. 2.41 లక్షల కోట్లు)గా నమోదైంది. గతేడాది ఆగష్టులో నమోదైన వాణిజ్య లోటు 35.64 బిలియన్ డాలర్ల(రూ. 3.14 లక్షల కోట్ల)తో పోలిస్తే ఈసారి 25.7 శాతం క్షీణించింది. భౌగోళిక రాజకీయ పరిణామాలు, ప్రపంచ వాణిజ్యంలో నెలకొన్న పాలసీ సవాళ్ల మధ్య భారత ఎగుమతులు మెరుగ్గా రాణించాయని వాణిజ్య కార్యదర్శి సునీల్ బర్త్వాల్ అన్నారు.

# అభివృద్ధి పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ బన్నాల

## 56 లక్షల వ్యయంతో జరుగుతున్న పనులు పైప్ లైన్ పూర్తయిన తర్వాత సీసీ రోడ్లు నిర్మాణం

**చిల్కానగర్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్ లో 56 లక్షల రూపాయల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. సాయిరాం నగర్ కాలనీలో సీవరేజ్ పైప్ లైన్, బీరప్పగడ్డలో స్ట్రామ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ పనులను జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, "డివిజన్‌లో దశల వారీగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పైప్ లైన్ పనులు పూర్తయ్యాక సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపడతాం" అని తెలిపారు. పనులు జరుగుతున్న సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. చిల్కానగర్ అభివృద్ధి కోసం విస్తృత నిధులు కేటాయించడంలో సహకరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కోకొండ జగన్, బింగి శ్రీనివాస్, సాయిరాం నగర్ కాలనీ సెక్రటరీ సాబేర్ పాషా, రవీంద్రరెడ్డి, నందగోపాల్, ప్రకాష్, బస్తీ వాసులు ఇంద్రసేనారెడ్డి, ఆనంద్, సత్యనారాయణ, మైసాలు బస్తీ మహిళలు పాల్గొన్నారు.





# వెంకటేశ్వర కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో అభివృద్ధి పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి. కాలనీలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ -ఉప్పల్ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రాధాన్యత క్రమంలో కొనసాగుతున్నాయి. కాలనీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం, లైటింగ్ తదితర అవసరమైన పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం. వెంకటేశ్వర కాలనీ ప్రజలకు అవసరమైన అన్ని



మౌలిక వసతులు అందించడానికి కృషి చేస్తున్నాం" అని భరోసా ఇచ్చారు. వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఈ పర్యటనలో పాల్గొని కాలనీలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను రజిత పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా సీసీ రోడ్ల మిగిలిన పనులు, డ్రైనేజీ సమస్యలు, వర్షపు నీటి నిల్వలు వంటి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. కార్పొరేటర్ వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి పనుల పురోగతిని సమీక్షించారు. మిగిలిన సీసీ రోడ్ల పనులను త్వరలో పూర్తి చేస్తామని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎమ్‌డబ్ల్యూఎస్ అధికారి సత్యనారాయణ, కాలనీ అధ్యక్షులు ఏసోజు నరసింహ చారి, బాకారం లక్ష్మణ్, సల్ల ప్రభాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, చంద్రశేఖర్, అన్నపురెడ్డి అపూర్ణ, సోమయ్య, పేరయ్య, రవీందర్, శ్రీనివాస రావు, బాబీ, ముకుంద్, కే. వెంకటేష్ గౌడ్, స్వామి, వెంకటేష్ యాదవ్, వెంకటరమణ రెడ్డి, ఆర్. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నెహ్రూనగర్ కాలనీలో టీఎస్ఐఐసి స్థల వివాదం

## ప్రభుత్వం జోక్యం చేసుకొని కాలనీవాసుల అవసరాలకు ఉపయోగపడేలా చూడాలని డిమాండ్

**మల్లాపూర్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ కాలనీ, మల్లాపూర్ గ్రామం సర్వే నంబర్లు 43, 44, 45లోని స్థలంపై వివాదం తలెత్తింది. ఈ స్థలానికి సంబంధించిన ప్రహరీ గోడను గతంలో ఎన్ఎఫ్‌సి కంపెనీ అధికారులు కూల్చగా, ఇప్పుడు అదే సర్వే నంబర్లలోని ఖాళీ భూమిలో కొత్తగా ప్రహరీ గోడ నిర్మాణాన్ని ప్రారంభించారు. స్థానిక ప్రజల అవసరాలకు ఈ స్థలాన్ని వినియోగించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో, టీఎస్ఐఐసి భూమిని ఇలాగే ఆక్రమణకు అనుమతించడం సరికాదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, కాలనీవాసుల అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌ను కోరారు. అలాగే, ఈ స్థల వివాదంపై ఎన్ఎఫ్‌సి కంపెనీ డిజిఎం, కుషాయిగూడ ఏసీపీ వెంకటరెడ్డితో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా ఈ భూమిని పరిరక్షించే విషయంలో ప్రభుత్వం నిర్ణయాత్మకంగా ముందుకు రావాలని ఆయన




స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకుడు సాయి జేన్ శేఖర్, నెహ్రూనగర్ కాలనీ వాసులు పాల్గొని, స్థలాన్ని ప్రజల అవసరాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# ఇకపై ఉబర్‌లో హెలికాప్టర్ బుకింగ్స్..!

**వచ్చే ఏడాది అందుబాటులోకి వచ్చే చాన్స్**

ప్రముఖ దిగ్గజ టాక్సీ సేవలందించే యాప్ ఉబర్‌లో కొత్త సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటి వరకు కారు, బైక్, ఆటో మాత్రమే బుక్ చేసుకునే అవకాశం ఉండేది. వీటితో పాటు యాప్‌లో హెలికాప్టర్ బుకింగ్స్ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. గతంలో ఈ సర్వీస్ కేవలం ఇటలీలో మాత్రమే అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం అత్యధిక జనాభా కలిగిన నగరాల్లో హెలికాప్టర్ రైడ్ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. ఉబర్‌లో కస్టమర్లకు హెలికాప్టర్ రైడ్‌లను అందించాలని యోచిస్తున్నామని శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన కంపెనీ తాజాగా ఒక ప్రకటనలో తెలిపింది. దీని కోసం, ఉబర్ ఎలక్ట్రిక్ ఎయిర్ టాక్సీల తయారీ సంస్థ జాబీ ఏవియేషన్‌తో జతకట్టి వచ్చే ఏడాది (2026)లో సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిసింది. జోబీ బ్లేడ్ ఎయిర్ మొబిలిటీని %వి%125 మిలియన్ల ఒప్పందంలో భాగంగా ఈ విషయం చోటుచేసుకుంది. ఈ అంశంపై జాబీ వ్యవస్థాపకుడు, సీఈఓ అయిన జోబెన్ బెవిర్ట్ మాట్లాడుతూ.. ఉబర్ కస్టమర్లకు విమాన ప్రయాణాన్ని పరిచయం చేయడానికి తాము ఉత్సాహంగా ఉన్నామని వెల్లడిరచారు. జోబీ ప్రతినిధి సీబీఎస్ మనీవాచ్‌తో మాట్లాడుతూ.. రూట్లు, ధరల గురించి కంపెనీ ఇంకా ఖరారు చేయలేదని, అయితే విమానాశ్రయ కనెక్షన్లు వినియోగదారులకు ఆకర్షణీయంగా ఉంటాయని తెలిపారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# భారత్‌ను 'టారిఫ్‌ల మహారాజు'గా అభివర్ణించిన వైట్‌హౌస్ సలహాదారు

భారత్‌అమెరికా మధ్య కీలక వాణిజ్య చర్చలు జరగడానికి ఒక రోజు ముందు, వైట్‌హౌస్ ఉన్నతాధికారి నుంచి తీవ్రమైన వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఎట్టకేలకు భారత్ దారికొస్తోందని అని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో నోరుపారేసుకున్నారు.భారత్‌ను 'టారిఫ్‌ల మహారాజు' అని అభివర్ణించిన నవారో, వాణిజ్య చర్చల విషయంలో భారత్ తన వైఖరి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. నవారో ఇటీవల భారత్ పై తరచుగా దురుసు వ్యాఖ్యలు చేస్తున్నారు. 'రియల్ అమెరికాస్ వాయిస్' అనే షోలో మాట్లాడిన నవారో, ''ప్రపంచంలోని ప్రధాన దేశాల్లో అమెరికాపై అత్యధిక సుంకాలు విధిస్తున్నది భారతే. ఈ విషయాన్ని మేం కచ్చితంగా పరిష్కరించుకోవాలి'' అని అన్నారు. అంతే కాకుండా, రష్యాఉక్రెయిన్ యుద్ధం తర్వాత భారత్ చౌకగా రష్యా చమురు కొనుగోలు చేస్తూ లాభాలు గడిస్తోందని, దీనివల్ల అమెరికా పన్ను చెల్లింపుదారులు యుద్ధం కోసం మరింత డబ్బు పంపాల్సి వస్తోందని ఆయన ఆరోపించారు.మంగళవారం నాడు ఢిల్లీలో భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు జరగనున్నాయి. ఈ చర్చలను వేగవంతం చేసేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయని భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి, ముఖ్య సంధానకర్త రాజేష్ అగర్వాల్ ధృవీకరించారు. ఈ చర్చల కోసం దక్షిణాసియాలో అమెరికా వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ ఒక రోజు పర్యటనపై ఢిల్లీకి రానున్నారు.గత నెలలో రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు తగ్గించుకోవడానికి భారత్ నిరాకరించిందన్న కారణంతో, భారత ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలను 50 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. దీంతో ఆగస్టులో భారత ఎగుమతులు తొమ్మిది నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. అయితే, ఇటీవలే ప్రధాని మోదీని 'గొప్ప ప్రధాని' అని ట్రంప్ ప్రశంసించడం, దానికి మోదీ సానుకూలంగా స్పందించడం వంటి పరిణామాలు ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడే అవకాశం ఉందని సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జరగబోయే వాణిజ్య చర్చలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.


# 140 కోట్ల మంది ఉన్నారు, గంపెడు మొక్కజొన్న పొత్తులైనా కొనరు

అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ మరోసారి భారత్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అమెరికా నుంచి మొక్కజొన్నను దిగుమతి చేసుకోవడానికి భారత్ చూపిన విముఖత అలాగే విధించిన అధిక సుంకాలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. భారత్ తన సుంకాలను తగ్గించుకోకపోతే.. అమెరికాతో ఆరోగ్యకరమైన వాణిజ్య సంబంధాలను కొనసాగించడం కష్టం అవుతుందని లుట్నిక్ హెచ్చరించారు. భారత దేశంలో 140 కోట్ల మంది ప్రజలు ఉన్నారని లుట్నిక్ తెలిపారు. మరి వారు అమెరికా నుంచి కనీసం ఒక్క గంపెడు మొక్కజొన్ననైనా ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. భారత్ మనకు ప్రతిదీ అమ్ముతోందని.. కానీ మన మొక్కజొన్నను కొనడానికి మాత్రం వారు నిరాకరిస్తారని తెలిపారు. అంతేకాకుండా భారత్ ప్రతి దానిపై సుంకాలు విధిస్తోందని లుట్నిక్ పేర్కొన్నారు. ఇది కేవలం వారు మాత్రమే లాభం పొందే వాణిజ్య సంబంధం అని ఆయన అభివర్ణించారు. అమెరికా మార్కెట్‌కు భారత్ సులభంగా ప్రవేశాన్ని పొందుతున్నప్పటికీ.. అమెరికన్ వస్తువులపై మాత్రం ఆంక్షలు విధిస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలను పునరుద్ఘాటిస్తూ.. 'న్యాయమైన, పరస్పర వాణిజ్యం' ఉండాలని లుట్నిక్ అన్నారు. ''మీ సుంకాలను తగ్గించుకోండి, మీరు మాతో ఎలా ప్రవర్తిస్తున్నారో అలాగే మేము కూడా మీతో ప్రవర్తిస్తాం'' అని ఆయన భారత్‌కు పరోక్షంగా సూచించారు. లుట్నిక్ ప్రకారం.. భారత్ వస్తువులపై సుంకాలు విధించడం ద్వారా గతంలో జరిగిన అన్యాయాలను సరిచేయాలని అమెరికా కోరుకుంటోంది. ట్రంప్ ప్రభుత్వం భారతీయ వస్తువులపై 50 శాతం వరకు సుంకాలు విధించింది. అంతే కాకుండా రష్యా నుంచి భారత్ కొనుగోలు చేస్తున్న చమురుపై 25 శాతం పన్నును కూడా విధించింది. ఇది అన్ని దేశాలపై విధించిన దానికంటే చాలా ఎక్కువ కాగా దీని గురించి లుట్నిక్ స్పందించారు. ఇది మా అధ్యక్షుడి నమూనా, మీరు దీన్ని అంగీకరించాలి లేకపోతే ప్రపంచంలోనే అతి పెద్ద వినియోగదారు అయిన అమెరికాతో వ్యాపారం చేయడం మీకు కష్టం అవుతుందని లుట్నిక్ స్పష్టం చేశారు.

# అవినీతిపై నిరసనలు సమర్థనీయమే

**మనీలా :** అవినీతి కుంభకోణాన్ని నిరసిస్తూ ప్రజలు పెద్ద ఎత్తున వీధులలో ఆందోళన చేపట్టడాన్ని తాను తప్పుపట్టబోనని ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినార్డ్ మార్కోస్ తెలిపారు. ప్రజల నిరసన సమర్థనీయమేనని ఆయన చెప్పారు. వరద నియంత్రణ ప్రాజెక్టులలో చోటుచేసుకున్న అవినీతిపై ఇటీవలి కాలంలో రాజధాని మనీలాలో అనేక నిరసన ప్రదర్శనలు జరిగాయి. యూనివర్సిటీ ప్రాంగణంలో మూడు వేల మందికి పైగా విద్యార్థులు జరిపిన ప్రదర్శన కూడా వీటిలో ఒకటి. 1972లో మార్కోస్ తండ్రి విధించిన మార్షల్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ముందు జాగ్రత్త చర్యగా ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించింది. కుంభకోణంపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆండ్రన్ రేయస్ నేతృత్వంలో త్రిసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మార్కోస్ సోమవారం ప్రకటించారు. గత పది సంవత్సరాల కాలంలో వరద నియంత్రణ ప్రాజెక్టులలో జరిగిన అవినీతిపై ఈ కమిషన్ విచారణ జరుపుతుంది. 'మీ ఆగ్రహాన్ని, అసంతృప్తిని వ్యక్తం చేశారు. న్యాయం కావాలని అడిగారు. అందులో తప్పేముంది?' అని ప్రజలను ఉద్దేశించి మార్కోస్ ప్రశ్నించారు. విచారణలో దోషులని తేలితే స్నేహితులు, బంధువులు సహా ఎవరినీ వదలబోమని మార్కోస్ స్పష్టం చేశారు. కుంభకోణంలో మార్కోస్ బంధువు, చట్టసభ స్పీకర్ మార్టిన్ రోమువాల్డెజ్ పాత్ర ఉన్నట్లు కొందరు సాక్షులు చెప్పిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్య చేశారు. అయితే తనపై వచ్చిన ఆరోపణలను మార్టిన్ తోసిపుచ్చారు. కాగా సుమారు 30 మంది ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తమ వద్ద ముడుపులు తీసుకున్నారని ఓ నిర్మాణ సంస్థ యజమానులు గత వారం ఆరోపించారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఫిలిప్పీన్స్‌లో అనేక కుంభకోణాలు వెలుగు చూస్తున్నాయి. పలువురు కీలక రాజకీయ నాయకులు దోషులుగా తేలికనప్పటికీ జైలు శిక్ష నుంచి తప్పించుకుంటున్నారు. 2023 25 మధ్యకాలంలో వరద నియంత్రణ ప్రాజెక్టులలో చోటుచేసుకున్న అవినీతి కారణంగా ప్రభుత్వ ఖజానాకు రెండు బిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ అంచనా వేసింది.

# అక్రమ వలసదారులపై ట్రంప్ కీలక నిర్ణయాలు



అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం డల్లాస్‌లో భారత సంతతికి చెందిన చంద్ర నాగమల్లయ్య దారుణ హత్యకు గురైన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ అమానుష ఘటనపై అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. నిందితుడిపై 'ఫస్ట్ డిగ్రీ మర్డర్' నేరం కింద పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారు. అలాగే తన పాలనలో అమెరికాను మళ్లీ సురక్షితంగా మారుస్తానని, అక్రమ వలసదారులు, నేరస్థుల పట్ల ఇక ఏ మాత్రం మెతక వైఖరి ఉండబోదని స్పష్టం చేశారు. ట్రంప్ తన ట్రూత్ సోషల్ వేదికపై ఈ ఘటన గురించి ప్రస్తావిస్తూ.. టెక్సాస్‌లోని డల్లాస్‌లో బాగా పేరున్న వ్యక్తి చంద్ర నాగమల్లయ్య దారుణ హత్య గురించి నేను తెలుసుకున్నానన్నారు. ఒక క్యూబన్ అక్రమ వలసదారుడు.. భార్య, కుమారుడి కళ్లెదుటే దారుణంగా అతడి తల నరికేశాడని వివరించారు. అలాంటి వ్యక్తి మన దేశంలో అస్సలు ఉండాల్సింది కాదని రాసుకొచ్చారు. 51 ఏళ్ల భారత సంతతి వ్యక్తి చంద్రమౌళి నాగమల్లయ్య డలాస్‌లోని మోటెల్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. 37 ఏళ్ల వయసు కల్గిన యొర్దానిస్ కోబోస్‌మార్టినెజ్ అనే వ్యక్తి అక్కడే ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మోటెల్లోనే ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలోనే అక్కడే ఓ పాడుబడిన వాషింగ్ మిషన్ ఉండగా.. యొర్దానిస్ కోబోస్‌మార్టినెజ్ అందులో బట్టలు ఉతుక్కున్నాడు. అయితే అది ఏమాత్రం సహించని చంద్రమౌళి నాగమల్లయ్య నేరుగా అతడి వద్దకే వెళ్లి నువ్వు చేసే పని నాకు నచ్చలేదని చెప్పడానికి బదులుగా.. అతడి తోటి మహిళా ఉద్యోగికి విషయం చెప్పాడు. దాన్ని వాడకూడదని చెప్పమని వివరించాడు. ఈక్రమంలోనే ఆమె వెళ్లి నిందితుడికి పాడుబడిన వాషింగ్ మిషన్ వాడొద్దని చెప్పింది. దీంతో నాగమల్లయ్యపై విపరీతమైన కోపం తెచ్చుకున్న అతడు నేరుగా వెళ్లి తన గదిలోంచి ఓ కత్తి తెచ్చుకున్నాడు. ఆపై నాగమల్లయ్య వద్దకు వెళ్లి గొడవ పడ్డాడు. కత్తితో పదే పదే దాడి చేశాడు. ముఖ్యంగా తల, మొండం వేరయ్యే వరకు కత్తితో నరుకుతూనే ఉన్నాడు. అయితే అతడు దాడి చేస్తున్నప్పుడు బాధితుడి భార్య, కుమారుడు కూడా అక్కడే ఉండి వద్దని వారించారు. అయినా వినకుండా నాగమల్లయ్యను చంపేసి.. ఆపై తలను బయటకు తీసుకెళ్లాడు. పార్కింగ్ స్థలంలో పడేసి కాళ్లతో తన్నుతూ.. ఆపై చెత్తబుట్టలో పడేసి పారిపోయాడు. అప్పటికే పోలీసులకు మోటల్ సిబ్బంది ఫిర్యాదు చేయగా.. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని వెంటాడి మరీ పట్టుకున్నారు.

# నెతన్యాహూ జాగ్రత్త, ఖతార్ మా మిత్రదేశం: ట్రంప్



గత వారం గాజాలో కాల్పుల విరమణ కోసం అమెరికా చేసిన ప్రతిపాదనలపై చర్చించేందుకు దోహాలో సమావేశం అయిన హమాస్ నేతలపై సమ్మిట్ ఆఫ్ ఫైర్ పేరుతో ఇజ్రాయెల్ విరుచుకుపడ్డ విషయం అందరకీ తెలిసిందే.అయితే ఈ దాడుల్లో ఖతార్ భద్రతా అధికారి సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. తాజాగా దీనిపై అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. తమ దేశానికి కీలక మిత్రదేశంగా ఉన్న ఖతార్ పట్ల చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా ఈ దాడులు లక్ష్యాలను ఛేదించడంలో విఫలం అయ్యాయని.. కానీ ఆరుగురి ప్రాణాలను మాత్రం తీశాయంటూ వ్యాఖ్యానించారు. మోరిస్టౌన్ విమానాశ్రయంలో ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ సమయంలోనే ఆయనకు మీడియా ప్రతినిధులు ఓ ప్రశ్న అడిగారు. ముఖ్యంగా ఈ దాడుల గురించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఏమైనా చెప్పాలనుకుంటున్నారా అని ప్రశ్నించారు. దీనికి ట్రంప్ సమాధానం చెబుతూ.. వారు చాలా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. హమాస్ విషయంలో ఏదైనా చర్య తీసుకోవాల్సి ఉంటుందని, కానీ ఖతార్ అమెరికాకు గొప్ప మిత్ర దేశం అని పేర్కొన్నారు. ఈ విషయం చాలా మందికి తెలియదని చెప్పారు. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడానికి కొన్ని రోజుల ముందు ఆయన న్యూయార్క్‌లో ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ బిన్ జస్సిమ్ అల్ థానీతో విందులో పాల్గొన్నారు. అప్పుడే ఖతార్ ప్రధానిని గొప్ప వ్యక్తిగా అభివర్ణించిన ట్రంప్.. ఆయనకు దేశ ప్రతిష్టను మెరుగుపరచుకోవాలని సలహా ఇచ్చానట్లు చెప్పారు. ప్రజలు ఖతార్ గురించి చాలా చెడుగా మాట్లాడుతున్నారని.. కానీ అలా ఉండకూడదని పేర్కొన్నారు. న్యూయార్క్‌లో సెప్టెంబర్ 11 దాడుల జ్ఞాపకార్థం జరిగిన ఈ విందులో మధ్య ప్రాచ్య ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ కూడా పాల్గొన్నారు. విందు తరువాత ఖతార్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ హమాహ్ అల్ ముఫ్తా ఎక్స్ వేదికగా.. అధ్యక్షుడితో గొప్ప విందు అని అన్నారు. అదిప్పుడే ముగిసిందని చెప్పుకొచ్చారు.

# అవినీతి నిరుద్యోగ నిర్మూలనే తమ ప్రభుత్వ అజెండా



నేపాల్‌లో తీవ్ర ఆర్థిక సంక్షోభం, ప్రభుత్వ నిర్ణయాలపై అసంతృప్తితో నేపాల్‌లో యువత చేపట్టిన ఆందోళనలు ఫలించాయి. 'జెన్ జీ' తరం ఆధ్వర్యంలో జరిగిన హింసాత్మక నిరసనల ధాటికి పాత ప్రభుత్వం కుప్పకూలగా, దేశంలో కొత్త రాజకీయ శకం మొదలైంది. దేశ మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కీ (73) తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టి తన మంత్రివర్గాన్ని ప్రకటించారు. దేశాన్ని తిరిగి గాడిన పెట్టడం, యువత ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ఈ తాత్కాలిక ప్రభుత్వం పనిచేయనుంది.ప్రధాని సుశీల కర్కీ తన మంత్రివర్గంలో ముగ్గురు కీలక వ్యక్తులకు స్థానం కల్పించారు. సమాజంలో మంచి పేరున్న, తమ రంగాల్లో నిపుణులైన వారిని ఎంపిక చేసుకోవడం గమనార్హం. ఓమ్ ప్రకాశ్ అర్యాల్ అవినీతికి వ్యతిరేకంగా పోరాడే ప్రముఖ న్యాయవాదిగా పేరున్న ఈయనకు హోం, న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల వంటి కీలక శాఖలను అప్పగించారు.కుల్మన్ ఘిసింగ్ నేపాల్ విద్యుత్ అథారిటీ మాజీ అధిపతిగా, దేశంలో ఏళ్ల తరబడి ఉన్న విద్యుత్ కోతలకు చరమగీతం పాడిన వ్యక్తిగా ప్రజల మన్ననలు పొందారు. ఇప్పుడు ఆయనకు ఇంధనం, మౌలిక సదుపాయాలు, రవాణా, పట్టణాభివృద్ధి శాఖల బాధ్యతలు ఇచ్చారు.ఈ నియామకంపై దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది.రమేశ్వర్ ఖానల్ప్రముఖ ఆర్థికవేత్త, మాజీ ఆర్థిక కార్యదర్శి అయిన ఈయనకు ఆర్థిక శాఖను కేటాయించారు. దేశంలో 25 శాతం మేర ఉన్న యువ నిరుద్యోగితను పరిష్కరించే గురుతర బాధ్యతను ఆయనపై ఉంచారు. తాజాగా జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని సుశీల కర్కీ మాట్లాడుతూ, తాను ఈ పదవిని కోరుకోలేదని, ప్రజల ఆకాంక్షల మేరకే బాధ్యతలు స్వీకరించానని స్పష్టం చేశారు. ''నా పేరు సమాజం నుంచి తెరపైకి వచ్చింది... ఈ ప్రభుత్వం 'జన్ జీ' తరం ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తుంది'' అని ఆమె హామీ ఇచ్చారు. అవినీతిని అంతం చేయడం, ఆర్థిక సమానత్వాన్ని సాధించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆమె పేర్కొన్నారు. ఇటీవలి ఆందోళనల్లో ధ్వంసమైన అధ్యక్ష భవనం సమీపంలోనే ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగడం దేశంలోని ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతోంది.సెప్టెంబర్ 8న ప్రభుత్వం సోషల్ మీడియాపై నిషేధం విధించడం, పెరుగుతున్న ఆర్థిక ఇబ్బందులతో యువతలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది.



# నేపాల్ క్యాబినెట్‌లోకి మరో ముగ్గురు మంత్రులు

నేపాల్ ప్రధాని సుశీలా కర్కి నేతృత్వంలోని తాత్కాలిక మంత్రివర్గంలో కొత్తగా ముగ్గురు మంత్రులను చేర్చుకున్నారు. అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడల్ సోమవారం వీరితో ప్రమాణస్వీకారం చేయించారు. ఆర్థిక మంత్రిగా రమేషోర్ ఖానల్, ఇంధన శాఖ మంత్రిగా కుల్మాన్ ఘీజింగ్, హోం మంత్రిగా ఓం ప్రకాష్ ఆర్యల్‌లతో ఆదివారం సుశీలా కర్కి క్యాబినెట్ ఏర్పాటు చేశారు. ఖానల్ ఇప్పటివరకు ఆర్థిక శాఖ కార్యదర్శిగా చేశారు. ఇప్పుడు మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆర్థిక సంస్కరణలపై గత ప్రభుత్వానికి ఆయన 400 పేజీలతో కొన్ని సిఫార్సులను కూడా అందచేశారు. ఒకప్పుడు నేపాల్‌లో విపరీతంగా వున్న విద్యుత్ కోతలకు అంతం పలికిన ఘనత కుల్మాన్ ఘీజింగ్‌దే. ప2016 వరకు నేపాల్ రోజుకు 18గంటల పాటు విద్యుత్ కోత ఎదుర్కొనేది. ఘీజింగ్ వచ్చిన తర్వాత మొదటిసారిగా 24గంటలు విద్యుత్ అందుబా టులోకి వచ్చింది. సుప్రీం కోర్టు న్యాయవాది అయిన ఆర్యల్ అవినీతిపై పోరాడే యోధుడుగా అందరికీ చిరపరిచితుడు. ప్రధాని కర్కికి అత్యంత విశ్వసనీయుడైన ఆర్యల్ పార్లమెంట్ రద్దుపై నెలకొన్న ప్రతిష్టంభనను పరిష్కరించేందుకు జరిగిన చర్చల్లో కీలక పాత్ర పోషించారు.

# బిహార్ ఎన్నికల్లో కింగ్‌మేకర్‌గా అవతరించనున్న ప్రశాంత్ కిశోర్



ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) ఇప్పుడు బిహార్ రాజకీయాల్లో కీలక శక్తిగా మారబోతున్నారా? త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కింగ్‌మేకర్‌గా అవతరించనున్నారని తాజా ఒపీనియన్ పోల్ ఒకటి స్పష్టం చేసింది. ఎన్నికల బరిలో ఉన్న ప్రధాన కూటముల మధ్య గట్టి పోటీ నెలకొన్న నేపథ్యంలో పీకే మద్దతు ఎవరికి దక్కితే వారే అధికార పీఠాన్ని చేజిక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఆదివారం వెలువడిన సర్వే ఫలితాల ప్రకారం, ప్రశాంత్ కిశోర్ స్థాపించిన జన్ సురాజ్ పార్టీకి 8.3 శాతం ఓట్లు లభించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరికి మీ మద్దతు అని ప్రశ్నించగా, సర్వేలో పాల్గొన్న వారిలో 13.70 శాతం మంది పీకే వైపు మొగ్గు చూపడం గమనార్హం.ఇక, సీఎం రేసులో ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ 33.5 శాతం మద్దతుతో అందరికంటే ముందున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు 24 శాతం మంది మద్దతు పలికారు. కూటముల విషయానికొస్తే, అధికార ఎన్డీయేకు 36.2 శాతం మంది మద్దతు తెలుపగా, ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన మహాకూటమికి 35.8 శాతం మంది ఓటు వేస్తామని చెప్పారు. ఈ రెండు కూటముల మధ్య కేవలం స్వల్ప ఓట్ల తేడా మాత్రమే ఉండటంతో పోరు రసవత్తరంగా మారనుంది.ఈ ఎన్నికల్లో నిరుద్యోగం, ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని సర్వేలో పాల్గొన్న ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. ఈ సమస్యలే ఎన్నికల ఫలితాలను నిర్దేశించే కీలక అంశాలుగా మారనున్నాయని తెలుస్తోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in